ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
గురువారం 21 నవంబరు 2024 | 5



కనుమరుగవుతున్న మత్స్యసంపద
» కానరాని పలు రకాలు
» నేడు మత్స్య దినోత్సవం
6

బాండ్ల కట్ట.. పాపాల పుట్ట



కాకినాడలో టీడీఆర్ బాండ్లు జారీ చేసిన సురేష్‌నగర్ పార్కు ప్రాంతం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడలో టీడీఆర్ బాండ్ల అడ్డగోలు జారీపై ఎట్టకేలకు ప్రభుత్వం కదిలింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న బాండ్ల బండారం గుట్టురట్టు చేయడానికి ఉపక్రమించింది. ఈ మేరకు రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి విచారణ బాధ్యత అప్పగించింది. దీంతో అక్రమాల డొంక తేల్చేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. బాండ్ల జారీ వెనుక జరిగిన తతంగంపై ఇప్పటికే లోతుగా విచారణ మొదలుపెట్టారు. బాండ్లు జారీ చేసిన అధికారులు, ఉద్దేశం, తెరవెనుక చక్రం తిప్పిన అప్పటి కాకినాడ సిటీ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి లెక్కలన్నీ ఆరా తీస్తున్నారు. గత వైసీపీ సర్కారు హయాంలో ద్వారంపూడి చేతిలో అధికారం ఉందని అడ్డగోలుగా వ్యవహరించారు. ప్రభుత్వ అవసరాల ముసుగులో అస్మదీయులకు భారీగా లబ్ధి చేకూర్చడం కోసం కాకినాడ కార్పొరేషన్ ఆదాయానికి గండి కొట్టేశారు. టీడీఆర్ బాండ్ల జారీ పేరుతో నిబంధనలకు పాతరేసి కార్పొరేషన్ నుంచి ఏకంగా రూ.411కోట్ల వరకు బాండ్లు ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చేశారు. దీనిపై ప్రతిపక్షంగా ఉన్న టీడీపీ పోరాటం చేయగా, అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే కొండబాబు స్వయంగా సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు.

బండారమంతా బద్దలే..

కాకినాడ కార్పొరేషన్‌లో చోటుచేసుకున్న టీడీఆర్ బాండ్ల జారీ కుంభకోణంపై కూటమి ప్రభుత్వం కన్నెర్ర చేయడంతో ఎట్టకేలకు విచారణ ప్రారంభమైంది. అక్రమార్కులను గుర్తించడానికి అధికారులు విచారణ ప్రారంభించడంతో అధికారుల్లో వణుకు మొదలైంది. ఎక్కడ ఇరుక్కుపోతామోననే భయం వెన్నాడుతోంది. ఈ అక్రమాలకు సంబంధించి బాధ్యులైన అధికారులపై చట్టపరంగా ప్రభుత్వం ముందుకువెళ్లనుండడంతో అప్పట్లో ఇక్కడ పనిచేసి బదిలీ అయిన కమిషనర్‌కు సైతం ఉచ్చుబిగుస్తోంది. వాస్తవానికి పూర్తిగా ప్రజోపయోగ అవసరాలకు మాత్రమే జారీ చేయాల్సిన టీడీఆర్ బాండ్లను గత వైసీపీ ప్రభుత్వం కాకినాడ కార్పొరేషన్‌లో అడ్డగోలుగా దుర్వినియోగం చేసింది. కార్పొరేషన్ అవసరాల ముసుగులో నచ్చిన ప్రాంతాలను ఎంపిక చేసి ప్రైవేటు వ్యక్తులకు మేలు చేకూర్చి తద్వారా అధికార పార్టీ కీలకనేత రెండు చేతులా సంపాదించేలా చేశారు. వాస్తవానికి గత వైసీపీ పాలనలో కాకినాడ సిటీ నియోజకవర్గ ఎమ్మెల్యే ద్వారంపూడి ఏం చెబితే అదే కార్పొరేషన్ అధికారులకు వేదంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా ఏంచెప్పినా జీహుజూర్ అనుకుంటూ తలూపేశారు. భవిష్యత్తు పరిణామాలను సైతం గమనించకుండా అడ్డగోలుగా వ్యవహరించారు. సదరు నేత చెప్పినట్టల్లా ఆడి టీడీఆర్ బాండ్లు జారీ చేసేశారు. ఇలా రూ.411కోట్లకుపైగా విలువైన బాండ్లను గత వైసీపీ ప్రభుత్వంలో కేవలం రెండేళ్ల వ్యవధిలో జారీ చేయడం తెరవెనుక జరిగిన భాగోతాన్ని చాటుతోంది. ప్రధానంగా సురేష్‌నగర్ పార్కు వ్యవహారంలో రూ.160కోట్ల వరకు అడ్డగోలుగా టీడీఆర్ బాండ్లు జారీచేసేశారు. దీనివెనుక అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి పాత్ర స్పష్టంగా ఉంది. వాస్తవానికి సురేష్‌నగర్ పార్కు పూర్తిగా ప్రభుత్వ స్థలం. దీనిలో పార్కు అభివృద్ధికి కార్పొరేషన్ నిధులు కూడా వెచ్చించింది. కానీ పార్కు స్థలం తనది అంటూ ఓ వ్యక్తి దొంగ డాక్యుమెంట్లు సృష్టించాడు. తన స్థలంలో పార్కు ఎలా నిర్మిస్తారంటూ అధికారులను బెదిరించాడు. ఇంతలో ద్వారంపూడి జోక్యం చేసుకున్నారు. తతంగం నడిపి భారీగా డబ్బులు కొట్టేశారు. అందులోభాగంగా పార్కు స్థలం తనది అని నకిలీ పత్రాలు సృష్టించిన వ్యక్తికి అండగా నిలబడ్డారు. ఈ స్థలాన్ని తిరిగి కార్పొరేషన్ పార్కు కోసం తీసుకోవడానికి సమ్మతించేలా చేసి ఆ స్థలానికి ధర కట్టించారు. ఆ మొత్తాన్ని నగదుకు బదులు టీడీఆర్ బాండ్ల రూపంలో జారీ చేశారు. ఒకరకంగా చెప్పాలంటే ప్రభుత్వ భూమిని ప్రభుత్వమే ప్రైవేటు వ్యక్తికి డబ్బులిచ్చి కొనుగోలు చేసినట్లయింది. దుమ్ములపేటలో ట్రాన్స్‌కో అధికారులు పరిశ్రమల అవసరాల కోసం విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించాలని నిర్ణయించారు. దీనికి అవసరమయ్యే స్థలం కూడా చాలా తక్కువ. అయితే ఈ స్థలాన్ని ట్రాన్స్‌కో సమకూర్చుకోవాలి. కానీ ఓ ప్రైవేటు వ్యక్తికి కోట్లలో లబ్ధి చేకూర్చడం కోసం అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి ఆదేశించడంతో కార్పొరేషన్ రంగంలోకి దిగింది. ఉచితంగా వచ్చే పోర్టు భూమిని కాదని పక్కనే ఉన్న 4.67ఎకరాల ప్రైవేటు భూమిని సేకరించారు. గజం రూ.28వేల మార్కెట్ ధర చొప్పున 1:4 నిష్పత్తిలో ఏకంగా రూ.251కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లను సదరు ప్రైవేటు వ్యక్తికి జారీ చేసేశారు. ఈ టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై అప్పటి టీడీపీ మాజీ ఎమ్మెల్యే కొండబాబు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. జనసేన, బీజేపీ నేతలు సైతం నిరసనలు నిర్వహించారు.

రెండునెలల్లో తేలనున్న కథ...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైసీపీ హయాంలో చోటుచేసుకున్న టీడీఆర్ బాండ్ల అక్రమాలపై ఆరా తీసింది. అధికారుల ద్వారా నివేదికలు రప్పించుకుంది. కాకినాడ టీడీఆర్ బాండ్ల కుంభకోణంపైనా నివేదికలు వెళ్లాయి. దీనిపై విచారణకు ఆదేశించాలని కోరుతూ టీడీపీ ఎమ్మెల్యే కొండబాబు రెండు నెలల కిందట సీఎం చంద్రబాబును కలిశారు. ద్వారంపూడి ఏవిధంగా బాండ్ల కుంభకోణం చేశారో ఆధారాలతో వివరించారు. వీటన్నింటినీ సీఎం తన కార్యాలయ ప్రధాన కార్యదర్శి ముద్దాడ రవిచంద్రకు పంపారు. దీంతో ఇటీవల కాకినాడ టీడీఆర్ బాండ్ల జారీ కుంభకోణంపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి ఈకేసు అప్పగించింది. దీంతో కొన్నిరోజుల కిందట ఆ విభాగం అధికారులు కాకినాడకు వచ్చి స్థలాలు పరిశీలించారు. బాండ్ల జారీకి సంబంధించి త్వరలో ఫైళ్లను కూడా స్వాధీనం చేసుకోబోతున్నారు. ఆసమయంలో పనిచేసిన అధికారులను పిలిపించి దర్యాప్తు చేపట్టనున్నారు. దీనివెనుక అసలు ఏంజరిగింది? తెరవెనుక ఎవరు ఒత్తిడి తెచ్చారు? తదితర కోణాలపై విచారణ బృందం స్టేట్‌మెంట్లను కూడా రికార్డు చేసి రెండునెలల్లోపు అక్రమాలపై ప్రభుత్వానికి నివేదిక అందజేయనుంది.

- కాకినాడ కార్పొరేషన్‌లో టీడీఆర్ బాండ్ల బండారంపై 'విజిలెన్స్'
- అక్రమాలపై ప్రభుత్వం ఉక్కుపాదం
- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ ప్రారంభం
- గత వైసీపీ సర్కారు కాకినాడలో అడ్డగోలుగా రూ.412కోట్ల టీడీఆర్ బాండ్ల జారీ
- ప్రభుత్వ స్థలమైన సురేష్‌నగర్ పార్కు పేరుతో రూ.161కోట్లు
- విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం సాకుతో ప్రైవేటు స్థలానికి రూ.251కోట్లు బాండ్లు
- తెరవెనుక చక్రం తిప్పిన కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి
- ఈ రెండుచోట్ల భారీ కుంభకోణం జరగడంపై అప్పట్లో టీడీపీ పోరాటం
- సీఎం చంద్రబాబును కలిసి ఇటీవల ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ భావోద్వేగం

- కంటతడి పెట్టుకున్న షాన్‌మోహన్
- తన తల్లిదండ్రులు అంకితభావంతో పనిచేయడంవల్లే తాను ఈ స్థానంలో ఉన్నానంటూ కన్నీళ్లు



భావోద్వేగానికి గురై కంటతడి పెడుతున్న కలెక్టర్

బాలలపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే పోక్సో చట్టం కింద చర్యలు



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్
- అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాలలపట్ల అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించే వారి పట్ల పోక్సో చట్టం కింద కఠినమైన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కాకినాడలోని అంబేడ్కర్‌భవన్ స్టేడియంలో ఐసీడీఎస్, విద్య పోలీస్‌శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, అసిస్టెంట్ కలెక్టర్ భావన, కాకినాడ డీఎస్పీ రఘువీర్‌విష్ణు జ్యోతి ప్రజ్వలనతో వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ప్రతిఒక్కరి జీవితంలో బాల్యం అపురూపమైన దశని, దాన్ని మధురమైన ఘట్టంగా నిలిపేందుకు బాలలకు ప్రత్యేక హక్కులు కల్పించి, వారి రక్షణ కోసం పోక్సో వంటి కఠినమైన చట్టాలను అమలు చేయడం జరుగుతోందన్నారు. అయినా బాలల పట్ల లైంగిక అకృత్యాలు, హక్కుల హననం కొనసాగడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి దురాగతాలను అరికట్టాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతోపాటు ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాలలపట్ల జరుగుతున్న అమానుష సంఘటనలపట్ల ఆవేదనతో కొద్దిసేపు ఉద్వేగానికి లోనయ్యారు. చైల్డ్ సేఫ్ జిల్లాగా కాకినాడను తీర్చిదిద్దే లక్ష్యంగా జిల్లాలో 6నెలలపాటు ఉద్యమ కార్యాచరణను అమలు చేపట్టి చైల్డ్ అబ్యూజ్ నివారణకు గుడ్-బ్యాడ్ టచ్ గురించి, బాల బాలికల్లోను, పిల్లల హక్కులు, రక్షణ, పోక్సో చట్టంపట్ల పెద్దల్లోను విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నారు. తమపట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే బాలలు 1098, 112 హెల్ప్ లైన్లకు ఫోన్ చేయవచ్చున్నారు. 7331126044 నెంబరుకు వాట్సాప్ ద్వారా కూడా తెలియజేసి తక్షణ సహాయం పొందవచ్చునన్నారు. 112 కంట్రోల్ రూమ్ నెంబరుకు ఫోను చేయించి అత్యవసర రక్షణ పోలీస్‌శాఖ ద్వారా ఎలా పొందవచ్చో లైవ్ డెమో ద్వారా వివరించారు. జిల్లాలో వివిధ అంశాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసా పురస్కారాలను పంపిణీ చేశారు. పీఎం కేర్స్, సీఎం కేర్స్ పథకాల కింద సంరక్షణ పొందుతున్న పిల్లలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యులు ఆదిలక్ష్మి, కార్మికశాఖ ఏసీఎం బుల్లిరాణి, డీఆర్డీఏ ఏపీడీ ఎంఎం జిలానీ, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సముద్రంలో వ్యర్థాల జలాల విడుదలపై..

కోన ప్రాంత రైతుల అభ్యంతరం


కాకినాడ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో తొండంగి మండలం రైతులు

- తీర ప్రాంత సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతి
- ఫార్మా కంపెనీలు, రైతుప్రతినిధుల బృందంతో చర్చలు
- నెలరోజుల్లో పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ

కలెక్టరేట్(కాకినాడ)/తునిరూరల్,నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అరబిందో, దివీస్, పోర్టు కంపెనీలపై తొండంగి మండలంలోని తీర గ్రామాలు బుసలు కొడుతున్నాయి. నిర్వాసితుల ప్యాకేజీ, కాలుష్య నియంత్రణ వంటి అంశాలను ఫార్మా కంపెనీలు గత వైసీపీ ప్రభుత్వంలో పెడచెవిన పెట్టాయి. కాలుష్య రహిత కర్మాగారాలకు ప్రభావిత గ్రామాలు అభ్యంతరం చెప్పలేదు. పరిశ్రమలనుంచి విషతుల్య వాయువు వెలువడడం, రసాయనిక వ్యర్థాలు సముద్రంలోకి విడుదల అవుతున్న తీరుపై కోనగ్రామాలు పార్మాకంపెనీల వైఖరిని తప్పు పడుతూ ఉద్యమ భేరి మోగించాయి. ఈ నేపథ్యంలో కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్, పార్మా కంపెనీలు, రైతు ప్రతినిధుల బృందంతో బుధవారం సంప్రదింపులు జరిపారు. అనంతరం టీడీపీ నేత యనమల రాజేష్ నేతృత్వంలో రైతు ప్రతినిధి బృందం తమ డిమాండ్లకు సంబంధించిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు అందజేశారు. వారి సమస్యలను నెలరోజుల్లో పరిష్కరిస్తామని ఆయా కంపెనీల ప్రతినిధులు, కలెక్టర్ హామీఇచ్చారు. ఆర్డీవో శ్రీరమణి, తహసీల్దార్ ముఖర్జీ, చొక్కా అప్పారావు, కొయ్యా కేశవ్, కొయ్య సూరిబాబు, యాదాల రాజబాబు, కాలిపోయిన చంద్రరావు, కొయ్యాగా మల్లేష్, మనుముల కొండబాబు, యాదాల సింహాచలం, బూర్తి సంహాచలం పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు నాగమణి

కాకినాడ సిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గ్రంథాలయంలో వారం రోజులుగా నిర్వహించిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు జి.నాగమణి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజ్ఞానాన్ని పంచే భాండాగారాలు గ్రంథాలయాలన్నారు. పుస్తక పఠనంలో ఉన్న తృప్తి కంప్యూటర్ సెర్చింగ్‌లో ఉండదన్నారు. పుస్తక పఠనానికి మార్గం సుగమం చేసేవి గ్రంథాలయాలన్నారు. వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో హరీష్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎల్ఎన్ఎస్ వరప్రసాద్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లూరు జియ్యన్న వెంకటేశ్వరస్వామి ఆలయ చరిత్రపై..

బహిరంగ విచారణ

- హాజరైన పురావస్తు, దేవదాయ శాఖ, రెవెన్యూశాఖల అధికారులు
- ఫిర్యాదుల ఆధారంగా నిజానిర్ధారణకు విచారణ


గండేపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో జియ్యన్న మఠంలో వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ చరిత్రపై బుధవారం ఆలయ ఆవరణలో బహిరంగ విచారణ నిర్వహించారు. ఆలయ చరిత్ర, ఇతరఅంశాలపై దాఖలైన ఫిర్యాదుల ఆధారంగా ప్రభుత్వం నిజానిర్ధారణకు పురావస్తుశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆధ్వర్యంలో పురావస్తు, దేవదాయశాఖ, రెవెన్యూశాఖల అధికారులతో ఒక కమిటీ వేసి ఈ బహిరంగ విచారణ చేపట్టారు. ఈ సమావేశానికి పెద్దాపురం ఆర్డీవో కె.శ్రీరమణి, ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ బీఎల్‌వీ రమేష్‌బాబు, పురావస్తు, మ్యూజియంశాఖ విజయవాడ డిప్యూటీ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ అర్చకులు, వివిధ ప్రజాప్రతినిధులు, గతంలో పనిచేసిన ట్రస్టు బోర్డు సభ్యులు,గ్రామస్తులు అభిప్రాయాలు తెలిపారు. వీటన్నింటినీ కమిటీ సభ్యులు నమోదు చేసుకున్నారు.తాళ్లూరు ఆలయ భూములపై గ్రామపెద్దలు వివరణకోరగా ఎండోమెంట్ ఈవో ఉండమట్ల రాజేష్ అధికారుల సమక్షంలో తెలియపరిచారు. సేకరించిన అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని కమిటీ సభ్యులు తెలియజేశారు. ఒకానొక సమయంలో సమావేశం రసాభసాగా మారడంతో అక్కడేఉన్న గండేపల్లి ఎస్‌ఐ యువీ శివనాగబాబు ఘర్షణలు చోటుచేసుకోకుండా అదుపుచేశారు. సమావేశం అనంతరం అధికారులు మాట్లాడుతూ ఆలయ చరిత్ర, ఇతర అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టామని ఈ అంశాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని వెల్లడించారు. కొన్నేళ్లుగా తాళ్లూరు వెంకటేశ్వరస్వామి దేవస్థానం అర్చకులు, పురావస్తు, మ్యూజియం శాఖ విభాగాల మధ్య భేదాభిప్రాయాలను సభలో ప్రస్తావించారు. తహసీల్దార్ శ్రీనివాస్, జగ్గంపేట సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ శివనాగబాబు, ఎండోమెంట్ ఈవో ఉండమట్లరాజేష్, ఆలయ కమిటీ చైర్మన్ దాపర్తి సీతారామయ్య, శీలామంతుల వీరబాబు, పైణ్ణి వెంకటేశ్వరరావు, ఆలయ అర్చకులు సత్యనారాయణ,నర్సింహమూర్తి,శేషావతారం,భాస్కర్ పాల్గొన్నారు.


గండేపల్లి మండలం తాళ్లూరులో మాట్లాడుతున్న పెద్దాపురం ఆర్డీవో

అదృశ్యమైన బాలిక 12గంటల్లో అప్పగింత

ప్రత్తిపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): 12గంటల్లో అదృశ్యమైన బాలికను ప్రత్తిపాడు పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. దీనికి సంబంధించి ప్రత్తిపాడు ఎస్‌ఐ ఎస్.లక్ష్మీకాంతం బుధవారం రాత్రి వివరాలు వెల్లడించారు. ప్రత్తిపాడుకు చెందిన 14ఏళ్ల బాలిక మంగళవారం రాత్రి 11గంటల సమయంలో అదృశ్యమైంది. దీంతో తల్లిదండ్రులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ బి.సూర్యఅప్పారావు ఆధ్వర్యంలో వెంటనే పోలీసులు బాలిక ఆచూకీకోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టి 12గంటల వ్యవధిలోనే అదృశ్యమైన బాలిక ఆచూకీ గుర్తించి బుధవారం తల్లిదండ్రులకు బాలికను అప్పగించారు. ఈ కేసులో వెంటనే స్పందించి 12 గంటల వ్యవధిలోనే బాలిక ఆచూకీ కనుగొన్న డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలను ఎస్పీ విక్రాంత్‌పాటిల్ అభినందించారు.

లోకేశ్ సార్ నన్ను ఇండియాకు రప్పించండి


కువైట్‌నుంచి సెల్ఫీ వీడియోలో మాట్లాడుతున్న గారా కుమారి

- ఇక్కడ చిత్ర హింసలు పెడుతున్నారు
- ఏడు నెలలుగా తిండి లేదు
- కువైట్ నుంచి గండేపల్లి వాసి సెల్ఫీ వీడియో
- తల్లడిల్లుతున్న కుటుంబీకులు

గండేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): లోకేశ్ సార్.. నన్ను ఎలాగైనా తిరిగి స్వదేశానికి వచ్చేలా చర్యలు తీసుకోండి... ఇక్కడ చిత్రహింసలు పడుతున్నా.. ఏడు నెలలుగా సరిగ్గా తిండిలేదు అంటూ కువైట్‌కు ఉపాధి నిమిత్తం వెళ్లిన గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామానికి చెందిన గారా కుమారి పోస్టుచేసిన సెల్ఫీ వీడియో వైరల్ అయింది. జగ్గంపేట మండలం రామవరానికి చెందిన వెంకటేష్‌తో ఆమెకు 19ఏళ్ల కిందట వివాహమైంది. ఆమెకు నాగమణి, సుబ్బలక్ష్మి, ఆనంద్‌సామూల్ అనే ముగ్గురు సంతానం. తండ్రి అప్పారావు, తల్లి సీత ఉన్నారు. ఆమె భర్త ఐదేళ్ల కిందట మృతిచెందడంతో అత్తారింటి నుంచి అమ్మగారింటికి యల్లమిల్లి వచ్చేసింది. ఇక్కడ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుండగా కుటుంబం గడవకపోవడంతో కువైట్ వెళ్దామని నిర్ణయించుకుంది.ఆ సమయంలో పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన ఎం.సుధాకర్ అనే ఏజెంట్ ద్వారా కువైట్‌కు వెళ్లింది. అక్కడికివెళ్లి ఏడు నెలలు గడుస్తోంది. నరకకూపంలోకి దించడంతో సరిగ్గా తిండి లేక నానా ఇబ్బందులు పడుతోంది. అనారోగ్యంగా ఉన్నా ఇంటికి పంపించండి అని కోరగా రూ.2లక్షలు కడితే ఇంటికి పంపిస్తానని కొట్టి ఇంట్లోనే బంధిస్తున్నారని వీడియోలో ఆమె వాపోయింది. 'కువైట్‌లో జాబ్రాలి అస్మద్ నగరంలోని ఒక ఇంట్లో పనిచేస్తున్నా. ఆ ఇంట్లో 15నుంచి 20మంది ఉన్నారు. నాతో గొడ్డుచాకిరీ చేయించుకుంటున్నారు. ఎలాగైనా ఇక్కడి నుంచి తీసుకెళ్లండి. ఈ వీడియో చేస్తున్నానని వారికి తెలిస్తే నన్ను కొట్టి చంపేస్తారు.. భయంగా ఉంది. తొందరగా రక్షించండి మంత్రి నారా లోకేశ్ గారు" అంటూ కోరింది. ఈ వీడియోపై ఆమె పిల్లలు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తమ తల్లిని రక్షించాలని కోరుతూ కన్నీరు మున్నీరవుతున్నారు.

నర్సింగ్ స్కూల్, హాస్టల్‌లో అధికారుల తనిఖీలు

- పాల్గొన్న ఆర్డీవో మల్లిబాబు, డీఎంహెచ్‌వో నాయక్, ఐసీడీఎస్ పీడీ ప్రవీణ


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు, డీఎంహెచ్‌వో నాయక్

కాకినాడ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడరూరల్ మండలం ఇంద్రపాలెం పిల్ల కాలువరోడ్డులోని శ్రీలక్ష్మీగాయత్రిస్కూల్ ఆఫ్ నర్సింగ్, హాస్టల్‌ను కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, డీఎంహెచ్‌వో నరసింహనాయక్, ఐసీడీఎస్ పీడీ ప్రవీణ,రూరల్ తహసీల్దార్ కుమారి, ఎస్‌ఐ ఎం.వీరబాబు బుధవారం రాత్రి తనిఖీచేశారు. నర్సింగ్ స్కూల్‌లో ఫీజులు అధికంగా వసూలుచేస్తున్నారని ఆహారం వసతి సదుపాయాలు సరిగా లేవని, తమను పలు ఇబ్బందులకు గురిచేస్తున్నారని విద్యార్థినులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాల మేరకు తనిఖీ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో భాగంగా విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని వివరాలు సేకరించారు. 300మందికి పైగా ఎస్సీఎస్టీ విద్యార్థినులున్నారని మరుగుదొడ్లు, వసతిగదులు సరిగా లేవని అధికారులు గుర్తించారు. దీంతో ఈ సమస్యలను కలెక్టర్‌కు తెలుపగా నర్సింగ్ స్కూల్ యాజమాన్యంపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని, తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. ఇటీవలకాలంలో నర్సింగ్ స్కూల్స్ యాజమాన్యాలపై విద్యార్థినులనుంచి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో కాకినాడ జిల్లాలోని అన్ని నర్సింగ్ స్కూళ్లలోను అధికారులు తనిఖీలు చేసి వాటిలోని విద్యార్థినులకు సరైన వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారో లేదో తెలుపుతూ ఒక నివేదికను పంపించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

చేప..చేపా.. ఎక్కడమ్మా!



కనుమరుగవుతున్న మత్స్యసంపద

ఎన్నిరకాల చేపలు వచ్చేవి.. కొన్ని రకాల చేపల పేర్లు అయితే పలకడం కూడా వచ్చేది కాదు.. ఇప్పుడో ఒకటో రెండో రకాలు వస్తున్నాయ్.. ఏమైపోయిందా జలసంపద.. అలా అలా కనుమరుగైపోయిందంతే.. అటు సముద్రంలోకానీ.. ఇటు గోదావరిలో కాని కనుమరుగైన చేప జాతులు ఎన్నో ఉన్నాయి.. పూర్వం లెక్కపెట్టలేనన్ని చేప జాతులు ఉంటే.. నేడు ఒకటో రెండో రకాలు మార్కెట్లలో లభ్యమవుతున్నాయి. మత్స్య సంపదకు పెట్టింది పేరైన మన ప్రాంతంలో గోదావరి, సముద్రంలో విలువైన చేపల రకాలు తగ్గిపోతున్నాయి. సముద్రంలో పరిశ్రమల నుంచి కలిసే రసాయన వ్యర్థాలతో జలాలు కలుషితమై మత్స్యసంపద అంతరించు పోతుండడంతో వాటి వృద్ధి లక్ష్యంగా ప్రతిఏటా నవంబరు 21న మత్స్య శాఖ ద్వారా ప్రపంచ మత్స్యదినోత్సవం నిర్వహి స్తున్నారు. నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..



- అరుదైన.. జలపుష్పాలు
- కానరాని పలు రకాలు
- కొన్ని మాత్రమే లభ్యం
- గోదావరి వాసుల నిరాశ
- నాటికి.. నేటికీ ఎంతో తేడా
- ప్రభుత్వం దృష్టి పెట్టినా ఇంతే
- నేడు మత్స్య దినోత్సవం

కాకినాడ సిటీ/కొత్తపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పులస పులుసు.. వంజరం ఇగురు.. సొర పొట్టు.. రొయ్యల వేపుడు.. అబ్బా.. చదువు తుంటేనే నోరూరిపోతోంది కదూ.. ఉమ్మడి జిల్లాలో గోదావరి,సముద్రం, రిజర్వాయర్లు, చెరువుల్లో ఒక నాడు విరివిగా లభ్యమయ్యే చేపలు ఇవి.. మరి నేడు ఈ జాతులే కనుమరుగైపోయాయి. ఒకటీ అరా దొరుకుతున్నాయి. కాకినాడ, కోనసీమ జిల్లాల్లోని సము ద్రంలో మత్స్యకారులకు బోలెడు రకాల సముద్ర చేపలు లభ్యమ య్యేవి. యానాంతో పాటు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, ధవళేశ్వరంల్లో గోదావరి చేపలు విరివిగా లభ్యమయ్యేవి. మరి నేడు మత్స్య సంపద కనుమరుగైపోతోంది.

మత్స్యసంపదకు కేరాఫ్ కాకినాడ

మత్స్యసంపదకు కేరాఫ్ కాకినాడ జిల్లా నిలుస్తోంది. జిల్లాలోని ఉప్పాడ, తొండంగి, కాకినాడల్లో సముద్రంలో భారీగా చేపలవేట సాగుతోంది. ఇక్కడి మత్స్యకారులకు వివిధ రకాల చేపలు వలలకు పడుతుంటాయి. వంజరం, సందువా, కోనెం, మాగ,కొయ్యింగ, ట్యూనా రకాల చేపలు ఎక్కువగా దొరుకుతున్నాయి వీటితో పాటు రొయ్యలు, పీతలు పడుతున్నారు. అపోలో ఫిష్, ఎల్లలు, ఇంగిలాలు, టేకు, కార, కలివిందలు, కవళ్లు, సెత్తలు వంటివి పడుతున్నాయి. వీటికి డిమాండ్ భారీగా ఉంది. కాకినాడ నుంచి రోజూ వేల టన్నుల్లో చేపలు, రొయ్యలు, పీతలు ఎగు మతవుతున్నాయి.చేపలు చెన్నై, కేరళ, ముంబయి వంటి ప్రాంతాలకు ఎగుమతి జరుగుతోంది. టైగర్, రొయ్య, తెల్ల రొయ్యలు యూరోపియన్ దేశాలకు ఎగుమతవుతున్నాయి. సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా చెన్నైకు మత్స్య సంపద ఎగుమతులు జరుగుతున్నాయి. పెద్ద సైజు రొయ్యలు, పెద్ద సైజు పీతలు ఎగుమతుదారులకు లాభాలను ఆర్జించి పెడుతున్నాయి. కాకినాడలో ఐదు చోట్ల చేపల మార్కెట్లు ఉండగా అక్కడ వీటి విక్ర యాలు జరుగుతున్నాయి.కుంభాభిషేకం రేవులో ఉదయం వేళ తాజా చేపలు, రొయ్యలు, పీతలు అందు బాటులో ఉంటాయి. కాకినాడ జిల్లాలో 403 మెకనైజ్డ్ బోట్లు(పెద్ద బోట్లు), 3709 ఫైబర్ బోట్లు కలిపి మొత్తం 4,523 బోట్లు సముద్రంలో మత్స్య వేట సాగిస్తున్నాయి. వీటిపై ఆధారపడి 26,749 మంది మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. కాకినాడ, సముద్ర మత్స్య ఉత్పత్తులతోపాటు జిల్లాలో 9వేల హెక్టార్లలో రొయ్యల చెరువులు, చేపల చెరువులు ఉన్నాయి.మత్స్యకారులకు ఫిషింగ్ బోట్ల ద్వారా సముద్రంలో మత్స్యవేటపై శిక్షణ ఇచ్చే రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ కాకినాడలో ఉంది.



పులసలకు కేంద్రం యానాం..

అరుదైన చీరమేను కూడా దొరికేది ఇక్కడే

యానాం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): యానాం గోదావరిలో దొరికే చేపలకు ఎంతో గిరాకీ ఉంటుంది. ముఖ్యంగా గోదావరికి ఎర్రనీరు(వరద) వచ్చిందంటే చాలు పులసుల వేట మొదలవుతుంది. తూర్పుగాలుకు, వర్షానికి చీరమేను దొరుకుతుంది.ఈ ఏడాది ఇక్కడ చీరమేను అత్యధికంగా దొరకడం విశేషం. భారీ పండుగొప్పలు, ఎర్రచంగలం, తెల్ల చెంగలం, మగా, తెల్ల చందువా, నల్ల చందువా, సీదా చందువా, కట్టా చేపలు, పితాలు, గుడ్డ పితలు, తెల్ల, సేకా, పప్పు, గుడ్డు రెయ్యలు, మెత్తళ్లు, వివిధ రకాల దొందులు, ఏట్లు, రావలు, టేకు తదితర చేపలు యానాం గోదావరిలో లభ్యమవుతాయి.

కోనసీమలోను సముద్ర చేపలు

ఉప్పలగుప్తం/అల్లవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సముద్ర జలాలు,గోదావరి నదీపాయలలో చేపల వేట సాగిస్తూ మత్స్యసంపదపై ఆధారపడి వేలా ది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. సముద్రంలో వేల రకాల చేపలున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో కొన్ని రకాలు మాత్రమే లభిస్తుంటాయి. ఉప్పలగుప్తం మండలం వాసాలతిప్ప, ఎస్.యానాం కేంద్రాలుగా జరిగే సముద్ర చేపల వేటలో విలువైన మాగ, సొర, నలుపు, తెలుపు చందువా, కట్టపరిగెలు, కొయ్యింగ, పండుగప్ప, టూనా, సావిడాలు, కాణాకాంతలు, పలు రకాల గొరకలు, మెత్తళ్లు, కొమ్మురపాములు, పీతలు, విలువైన రొయ్యలు లభిస్తున్నాయి. ఇక సీజనల్‌గా ఏట్లు, చీరమేను వంటి రకాలు లభ్యమవుతుంటాయి. ఒకప్పుడు పనికిరానివిగా భావించిన సముద్రం గొరకలకు



ప్రస్తుతం మార్కెట్‌లో ఎంతో డిమాండ్ ఉంది. కారా చేపల విలువను మాంసాహారులు గుర్తించారు. సముద్రంలో దొరికే జలుగు చేపల రుచి అబ్బా అనిపించకమానదు. గిరాకీ కారణంగా జలుగులు, పండగొప్పలను చెరువుల్లో పెంచుతున్నారు. సముద్రంలో వాటినే మాత్రమే అందరూ ఇష్టపడుతున్నారు.







తగ్గిన విలువైన రకాలు

కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరప్రాంతంలో ఒకప్పుడు భారీస్థాయిలో చేపలవేట జరిగేది. ప్రస్తుతం సముద్రంలో చేపలు పడడం తగ్గింది. గతంలో ఇక్కడ చాలా ఖరీదైన, రుచికరమైన చేపలు, రొయ్యలు దొరికేవి. పెద్ద జాతి చేపలకు చెందిన వంజరం, కోనాము,సంధువా, మునివా లం, మాగ, సిదుములు, పెద్ద పెద్ద పట్టి సావ డాలు, టైగర్ జాతి రొయ్యలు, సొర్రలు, పండుగప్పలు, సింటు చేపలు విరివిగా మత్స్యకారుల వలలకు దొరికేవి.క్రమేపీ తీరప్రాంతాల్లో కాలుష్యం వెదజల్లే పరిశ్రమలు నెలకొల్పడం, డీప్ సీలో ఓడల నుంచి విడుదల చేసే వ్యర్థ రసాయనాలతో మత్స్యసం పద తగ్గిందని మత్స్యకారులే చెప్తున్నారు.

మత్స్యకారులకు సమగ్ర సమాచారం



సముద్రంలో వాతావరణ పరిస్థితులు, మత్స్య సంపద లభ్యమయ్యే ప్రదేశాలు తెలుసుకునేందుకు సాంకేతిక పరికరాలు అందుబాటులోకి తెచ్చాం. మత్స్యకారులకు సబ్సిడీపై పరికరాలు, వేట విరామ పరిహారం అందజేస్తున్నాం.

-జిల్లా మత్స్యశాఖ అధికారి కరుణాకరరావు

ఏటా 7 కోట్ల చేప పిల్లల ఉత్పత్తి

మత్స్య సంపద ఉత్పత్తికి కేరాఫ్ కడియం

కడియం,నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాల పేరు చెబితేనే మత్స్య సంపద గుర్తుకొస్తుంది. ఫేమస్ అయిన చేపలన్నీ ఈ జిల్లాలోనే లభ్యమవుతాయి. గోదావరినది, చెరువులు, రిజర్వాయర్‌ల్లో పెరిగే మత్స్య సంపదకు మంచి గిరాకీ ఉంది.ఈ మత్స్యసంపద ఉత్పత్తికి తూర్పుగోదావరి జిల్లా కడియం కేం ద్రంగా మారింది.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కోనసీమ, మెట్ట, కాలవ కింద ప్రాంతాలకు చేపపిల్లలను కడియం మత్స్యక్షేత్రం నుంచి పంపిస్తుంటారు. ప్రతిఏటా జూన్, జూలై, ఆగస్టు నెలల్లో ఏడు కోట్ల చేపపిల్లలను ఉత్పత్తి చేసి సరఫరా చేస్తుంటారు.జిల్లాలో ప్రధానంగా బొచ్చె, రాగండి, మ్రిగాల రకాల చేప పిల్లల ఉత్పత్తి జరుగుతోంది. జిల్లాలో 41 కిలోమీటర్ల పొడవుతో 10 వేల హెక్టార్ల నీటి విస్తీర్ణంతో గోదావరి నదిపై చేపల ఉత్పత్తుల ద్వారా 1843 మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. జూన్ నుంచి ఆగస్టు వరకు బ్రీడింగ్ ద్వారా చేపపిల్లల ఉత్పత్తి సాగుతుంది. ప్రతిఏటా కడియం మత్స్య క్షేత్రం నుంచి 25 నుంచి 30 లక్షల చేపపిల్లలు, జిల్లావ్యా ప్తంగా 50 లక్షల చేప పిల్లలు ఉత్పత్తి సాగుతోంది.ఇక్కడి నుంచి 3ఎంఎం పరిమాణం లో చేపలు(స్పాన్) తయారు చేసి ఫిషర్‌మెన్ సొసైటీలకు,అమలాపురం, ద్వారాపూడి, రాజవోలు,కొత్తపేట,రంపచోడవరం, రాజవొమ్మంగి, నిడదవోలు,సీతానగరం,బిక్కవోలు చేపల కేంద్రాలకు పంపించి అక్కడ 50 నుంచి 80 ఎంఎం పరిమాణంలో ఫింగర్ లింగ్స్ తయారు చేస్తారు. తర్వాత గోదావరిలో వదులుతారు. ఈ ఏడాది 7 కోట్ల మేర చేపపిల్లల(చేపచిరునారు) ఉత్పత్తి లక్ష్యం కాగా నూరుశాతం ఉత్పత్తి సాధించారు.





29.83 లక్షల చేపపిల్లలు వదిలాం



2023-24లో ఫింగర్‌లింగ్స్ పథకం ద్వారా మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా 50 నుంచి 80 ఎంఎం పరిమాణం ఉన్న 29.83 లక్షల చేపపిల్లలను గోదావరిలోకి వదిలాం. ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఏపీఎస్ఏడీఏ) యాక్ట్ కింద రైతులు ఆక్వాసాగు చేసుకునేలా అనుమతులు ఇస్తున్నాం.

-వి.కృష్ణారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి

మన్యం స్పెషల్.. 'ఎరగడ'





చింతూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎరగడ చేపలు.ఈ తరహా చేపలు కేవలం మన్యానికే పరిమితం.వారాంతపు సంతలే వీటి విక్రయ కేంద్రాలు.ఆదివాసీ మహిళలు వారి గ్రామ సమీపాల్లో జరిగే వారాంతపు సంతల్లో అమ్ముతుంటారు. ఒక్కో పోగు రూ.50 వరకు ఉంటుంది. వాగులు, వంకలు, చెరువులు, వరి పొలాలు.. ఇవన్నీ ఎరగడ చేపలు లభ్యమయ్యే ప్రదేశాలు. వేటకు పందిరి వలలు, చిక్కాలు, చేతివలలు వినియోగిస్తుంటారు.ఆదివాసీలకు ఎరగడ చేపలు ఆదాయ వనరుల్లో ఒకటి. వరి పొలాల్లో చేపల వేటకైతే ఒకట్రెండు కుటుంబాల వరకే పరిమితమవుతారు. పెద్ద చెరువుల్లో వేటకు మాత్రం వందల సంఖ్యలో కుటుంబాలు రంగంలోకి దిగుతుంటాయి.అక్కడ దొరికిన చేపల్ని ఒక పెద్ద పోగుగా పోసి తర్వాత అక్కడ వేటకు ఎన్ని కుటుంబాలు హాజరైతే అన్ని కుటుంబాల వారూ సమానంగా పంచుకుంటారు.ఆ వేటలో వివిధ రకాల సైజు చేపలు లభ్యమవుతుంటాయి. వాటిలో చిన్న సైజు చేపల్ని ఎంపిక చేస్తారు. అనంతరం వాటిని వరి గడ్డిపై పరిచి కాల్చుతారు. ఒక మోస్తరుగా చేపలు కాలిన తర్వాత వాటిని తిరిగి ఎండలో నాలుగైదురోజులపాటు ఆరబెడ తారు. వీటినే ఎరగడ చేపలంటారు. ఈ చేపల్ని నెల నుంచి రెండు నెలల వరకు నిల్వ చేసు కునే అవకాశం ఉంది. మన్యంలో ఇష్టమైన కూరల్లో ఒకటి ఎరడగ చేపల కూర.



శునకాల నేస్తం!









- వీధి కుక్కలకు ప్రతిరోజూ అన్నదానం
- తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు ఇదే పని
- ఎనిమిదేళ్లుగా క్రమం తప్పకుండా చేస్తున్న దంపతులు
- కాకినాడలోని వివిధ ప్రాంతాల్లో శునకాలకు అన్నదానం
- మొత్తం సొంత ఖర్చుతోనే.. విరాళాలు స్వీకరించరు
- రోజుకో రకం కూర, అప్పుడప్పుడూ చికెన్ కూడా..
- మూగజీవాలపై ప్రేమను చాటుతున్న దంపతులు



వీధి కుక్కలకు అన్నం పెడుతున్న కంటిపూడి రాంబాబు.. (పైన) కంటిపూడి రాంబాబు, ఆయన సతీమణి సత్యవేణి

సరిగ్గా వేకువజాము 5 గంటలు.. ఒక పెద్దాయన ఇంటి నుంచి జేబులో పేపర్లు పెట్టుకుని.. ఓ వైపు బకెట్ తగిలించుకుని ద్విచక్రవాహనంపై బయలుదేరతాడు.. కొంతదూరం వచ్చి ఓ చోట ఆగుతాడు.. అప్పుడు ఆ పరిసరాల్లోని వీధి కుక్కలన్నీ ఆయన్ను చూసి వెంటనే పరుగుపరుగున అక్కడకు వచ్చేస్తాయి. ఆయన తన జేబులోని ఓ పేపర్ కింద వేసి ఆ బకెట్‌లోంచి అన్నం తీసి అందులో వేస్తాడు.. అప్పటికే ఆకలి మీద ఉండే ఆ శునకాలు వెంటనే ఆ అన్నం తినేస్తాయి. ఆయన మళ్లీ ఇంటికెళ్లి ఇంకో బకెట్‌తో బయటకు వచ్చి వేరే ప్రాంతానికి వెళ్తారు.. అలా మధ్యాహ్నం 2 గంటల వరకు ఇదే పని. రోజూ ఐదారు బకెట్లతో అన్నం శునకాలు పెడుతుంటారు.. కాకినాడ నగరం, రూరల్ ప్రాంతాల్లో ఎనిమిదేళ్లుగా ఓ పెద్దాయన శునకాలపై ప్రేమతో ఇలా చేస్తున్నారు. ఆయన భార్య కూడా ఈ మహత్కార్యంలో భాగమయ్యారు. రోజూ తెల్లవారుజామున 3 గంటలకు లేచి భోజనం తయారు చేయడమే పనిగా పెట్టుకున్నారు.

కాకినాడ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తోటివారికి, కన్నవారికీ అన్నం పెట్టని రోజులివి.. ఒకరిద్దరికి అన్నదానం చేసి పది మందికి చెప్పుకుంటున్నవారు ఎందరో ఉంటున్నారు.. కానీ వీళ్లు ఎనిమిదేళ్లుగా కొన్ని వందలాది వీధికుక్కలకు రోజూ క్రమం తప్పకుండా అన్నం పెడుతూ.. మానవత్వం చాటుకుంటున్నారు. కంటిపూడి రాంబాబు, సత్యవేణి దంపతుల స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా రంగంపేట. పిల్లల చదువుల నిమిత్తం 2000 సంవత్సరంలో కాకినాడలోని తోట సుబ్బారావు నగర్‌కు వచ్చి స్థిరపడ్డారు. వీరికి ఒక కుమారుడు శభరీష్ ఉన్నాడు. రాంబాబు గతంలో వ్యవసాయం చేసేవారు. పిల్లలకు ఉద్యోగాలు రావడం.. ఆయనకూ వయసు పైబడడంతో కొన్నేళ్లుగా విశ్రాంతి తీసుకుంటూ ఉండేవారు. సహజంగా జంతు ప్రేమికుడైన రాంబాబుకు రోజూ బయటకి వెళ్లినప్పుడు తారసపడే వీధి కుక్కలను చూస్తుండేవారు. అవి ఆకలితో అలమటించడం చూసి చలించిపోయేవారు. ఆకలి ఎవరిదైనా ఒకటే. అడగనిదే అమ్మైనా పెట్టదు అంటారు.. కానీ మూగజీవాలు నోరు తెరిచి అడగలేవు కదా ఎలా అని ఆలోచించారు.. అదే విషయాన్ని తన భార్యకు చెప్పారు. అలా వీధికుక్కలకు రోజూ అన్నం పెట్టాలని ఆ దంపతులు నిర్ణయించుకున్నారు. అలా ఈ ప్రయాణం 2016లో ప్రారంభించారు. మూగజీవాలకు కడుపు నింపాలన్న ఈ దంపతుల ఆలోచన వారి కుమారుడు శభరీస్ తోడయ్యాడు. అతడు రిలయన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా ప్రతినెలా వీరికి రూ.15 వేలు పంపిస్తున్నాడు. ఈ డబ్బులతోపాటు వీరు రూ.5వేలు కలిపి మొత్తం రూ.20వేలతో వీధి కుక్కలకు రోజూ అన్నం పెట్టే కార్యక్రమం చేపడుతున్నారు. దీని గురించి వీరు గొప్పగా చెప్పుకోరు. ఈ అన్నదానానికి ఎవరి నుంచి సహాయం తీసుకోరు. తమ సొంత డబ్బులతోనే కుక్కలకు ఆకలి తీరుస్తున్నారు. వీళ్లు అన్నదానంతోపాటు వీధి కుక్కలకు ఎక్కడైనా గాయాలైనా సొంత ఖర్చుతోనే వైద్యం కూడా చేయిస్తున్నారు.

ఎక్కడెక్కడంటే..

కాకినాడ సిటీ, రూరల్ ప్రాంతాల్లోని బోట్ క్లబ్, వెంకట్‌నగర్, సురేష్‌నగర్, గొడారిగుంట, ఆర్టీవో కార్యాలయం రోడ్డు, నాగమల్లితోట జంక్షన్, డీమార్టు ఏరియా, మూడుగుళ్ల సెంటర్, తోట సుబ్బారావు నగర్, ప్రాంతాల్లోని రాంబాబు వీధికుక్కలకు రోజూ ఆహారం పెడుతున్నారు. దీనికోసం రాంబాబు భార్య సత్యవేణి ప్రతిరోజూ తెల్లవారుజామున 3గంటలకు నిద్ర లేస్తారు. వంట చేయడం ప్రారంభించి 5 గంటలకు ముగిస్తారు. ఒక్కోరోజు ఒక్కో మెనూ ఉండేలా చూస్తారు. పెరుగన్నం, కాయగూరలతో కూరన్నం, ఒక్కోసారి చికెన్ తయారు చేస్తుంటారు. అలా తయారుచేసిన ఆహారాన్ని ఉదయం 5గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఆయా ప్రాంతాల్లో అన్నం బకెట్‌ను బైక్‌కు తగిలించుకుని కనిపించిన ప్రతి కుక్కకు ఆహారం పెడుతుంటారు. ఇలా ప్రతి రోజూ 5నుంచి 6 బకెట్‌ల వరకూ ఆహారాన్ని కుక్కలకు పెడుతున్నారు. 8ఏళ్లుగా ఆ కుటుంబం ఈ విధంగా చేస్తోంది.

అందరూ ఆహారం అందించాలి

జంతువులన్నింటికంటే కుక్క విశ్వాసం గలది. వీధికుక్కలకు ఆహారం, తాగేందుకు నీరు ఇస్తే అవి ఎవరికీ హానిచేయవు. తమ ప్రాంతాల్లోని కుక్కలకు సమాజంలోని ప్రతిఒక్కరూ ఆహారం, తాగు నీరు అందించాలి. మూగజీవాలపట్ల జాలి, దయ చూపాలి. నాకు ఓపిక ఉన్నంతకాలం వీధి కుక్కలకు అన్నం పెట్టడం కొనసాగిస్తాను. ఏదొక మంచి పనిచేయాలనే ఉద్దేశంతో నేను, నా భార్య, కుమారుడు కలిసి కుక్కలకు అన్నం పెడుతున్నాం.

- కంటిపూడి రాంబాబు, జంతు ప్రేమికుడు

ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీకి

ఒక నామినేషన్ ఉపసంహరణ

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి దాఖలు చేసిన నామినేషన్లలో బుధవారం ఒక నామినేషన్‌ను ఉపసంహరణ జరిగినట్లు సహాయ రిటర్నింగ్ అధికారి వెంకట్రావు తెలిపారు. అహ్మద్ షేక్ అనే అభ్యర్థి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నట్లు పేర్కొన్నారు. దీంతో ప్రస్తుతం ఎన్నికల బరిలో ఐదుగురు అభ్యర్థులు మాత్రమే ఉన్నారు. 21వతేదీ వరకు ఉపసంహరణలకు సమయం ఉండడంతో బరిలో ఎవరు నిలుస్తారో అనేది గురువారం సాయంత్రానికి తేలనుంది.


ఇందుకూరు-1 గ్రామంలో చలి మంట కాగుతున్న ప్రజలు

మన్యంలో చలి పులి

దేవీపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నవంబరు నెలాఖరు రావడంతో మన్యంలో చలి తీవ్రత పెరుగుతోంది. ఏజెన్సీలో గ్రామాలన్నీ సాయంత్రం ఐదు గంటలకే చీకటిగా మారుతున్నాయి. పొగ మంచు కమ్మేయడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావట్లేదు. తీవ్రమైన చలి నుంచి బయటపడ్డానికి మంట వేసుకుని కాగుతున్నారు. మున్ముందు చలి మరింత పెరుగుతుందని స్థానికులు చెప్తున్నారు.



తల్లి ప్రేమకు సాటి లేదు...

సామర్లకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట జయలక్ష్మి థియేటర్ సమీపాన ప్రకాష్‌నగర్ నీలిమా శ్రీను ఇంటి ఎదురుగా ఒక వీధి కుక్క పిల్లను మోటారు సైకిలు ఢీకొనడంతో తలపగిలి మృతి చెందింది. దీంతో అప్పటిదాకా తన వద్దే పాలు తాగుతున్న తల్లి కుక్క తల్లడిల్లింది. అప్పటికే ఐదు పిల్లలు పాలు తాగాయి. పిల్ల కుక్క మృతి చెందిందన్న విషయం తెలియక దానిని సాకుతూ నువ్వూ పాలు తాగు అని లేపుతున్నట్టుగా కనిపించిన దృశ్యం ఆ దారిన వెళ్లే పలువురిని విస్మయపరిచింది.



కార్తీకంలోనూ అ'ధర'హో



- శీతాకాలం నేపథ్యంలో
- గుడ్డు ధరకు రెక్కలు
- పౌల్ట్రీ నిర్వాహకులకు ఊరట
- టోకుగా రూ.5.65
- చిల్లరగా రూ.7కి విక్రయం

మండపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో కూడా గుడ్డు ధర పరుగులు పెడుతోంది. పెరుగుతున్న ధర కోళ్ల ఫారాల నిర్వాహకులకు లాభాలు తెచ్చిపెడుతుంటే సామాన్యుడికి మింగుడుపడట్లేదు. రెండేళ్ల పాటు ఒడిదుడుకులు ఎదుర్కొన్న కోళ్ల పరిశ్రమ ప్రస్తుతం ఊపిరి పోసుకుంటోంది. గతంలో నష్టాల కారణంగా చాలా మంది రైతులు పిల్లలు బ్యాచ్‌లను వేయలేదు. దానివల్ల గుడ్డు డిమాండ్‌కు సరిపడా సరుకు లేకపోవడం ధరల పెరుగుదలకు కారణమని పౌల్ట్రీల నిర్వాహకులు చెప్తున్నారు. గుడ్డు తయారీకి రూ.4.80 అవుతుంది. ధర ఐదు రూపాయలు దాటి ఉంటేనే గిట్టుబాటు ఉంటుందని పౌల్ట్రీ రైతులు అంటున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 300 వరకు కోళ్ల ఫారాలు వున్నాయి. వీటిలో సుమారు 1.40 కోట్ల కోళ్లను పెంచుతున్నారు. రోజుకు 1.10 కోట్ల గుడ్ల ఉత్పత్తి జరుగుతోంది. స్థానిక అవసరాలకు 40శాతం గుడ్లు వినియోగిస్తుండగా 60శాతం గుడ్లు పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, బిహార్, బెంగాల్‌లకు ఎగుమతి అవుతాయి. కోళ్ల పరిశ్రమ కొన్నేళ్లుగా నష్టాల్లో కూరుకుపోగా తాజాగా పెరిగిన గుడ్డు ధర కాస్త ఊరటనిస్తోందని పౌల్ట్రీ నిర్వాహకుడు తాడి శేషారెడ్డి తెలిపారు. ప్రస్తుతం గుడ్డు ధర రూ.5.65కి చేరింది. బయట మార్కెట్లో చిల్లరగా రూ.6.50 నుంచి రూ.7 దాకా విక్రయిస్తున్నారు.



శిఖర ప్రతిష్ఠ చేస్తున్న అర్చకస్వాములు, తిలకిస్తున్న భక్తులు

ఘనంగా భావనారాయణస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ

సర్పవరం జంక్షన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుప్రసిద్ధ పురాతన క్షేత్రం సర్పవరం శ్రీరాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి ప్రధాన ఆలయ గోపురంపై శిఖర ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్ద పుల్ల శ్రీరాములు, ఆలయ మాజీ చైర్మన్ పుల్ల శ్రీను, దాతల ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి మూలవరులకు స్నపన తిరుమంజనం, కళావాహన, గోదర్శనం, అష్టోత్తర శత ఘటాభిషేకం, శాంతికర కల్యాణం, పంచామృతాభిషేకం, పలు రకాల విశేష ద్రవ్యాలతో హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో స్వామివారి ప్రధాన ఆలయ గోపురంపై శిఖర కలశ, సుదర్శన చక్రం ప్రతిష్ఠ వేలాది మంది భక్తుల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారికి నైవేద్యంగా సమర్పించిన బూరెలను శిఖరంపై ఉంచి పూజలు చేశారు. వాటిని స్వామివారికి నివేదించిన తర్వాత భక్తులకు పంపిణీ చేశారు. మహిళలు చీర కొంగుల్లో బూరెలను ఒడిసిపట్టుకుని ప్రసాదం స్వీకరించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉప కమిషనరు కార్యాలయ సూపరింటెండెంట్ సోమరాజు, కూటమి నాయకులు పుల్ల శ్రీరాములు, ముద్దన ప్రకాశ్, పుల్ల వీరబాబు, వాసంశెట్టి వెంకటేశ్వరరావు, మానేపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.


భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

గండిపోశమ్మ దర్శనం పునః ప్రారంభం

దేవీపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండిపోశమ్మ అమ్మవారి దర్శనాలు బుధవారం పునఃప్రారంభమయ్యాయి. జూలైలో వచ్చిన వరదలకు గోదావరి ఉప్పొంగి గండిపోశమ్మ ఆలయం ముంపునకు గురైంది. దీంతో అమ్మవారి దర్శనాలకు భక్తులు దూరమయ్యారు. వరద దగ్గి అమ్మవారి ఆలయం బయటపడడంతో అధికారులు ఆలయాన్ని శుభ్రపరిచి సంప్రోక్షణ చేశారు. అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో మహిళా భక్తులు 108 బిందెలతో గోదావరి జలాలు తీసుకొచ్చి అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. గండిపోశమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవచ్చని, అన్ని ఏర్పాట్లు చేశామని దేవస్థానం ఈవో లక్ష్మీకుమార్ తెలిపారు. పూజల అనంతరం అన్నదానం చేశారు. ఆదివారం భక్తుల సంఖ్య అధికం కానున్న దృష్ట్యా మరిన్ని ఏర్పాట్లు చేయాలని పలువురు కోరారు.

రాజమహేంద్రవరంలో జీఆర్‌టీ జ్యువెలర్స్ ప్రారంభం



రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మేలిమి బంగారు ఆభరణాల అమ్మకంలో పేరెన్నిక గన్న జీఆర్‌టీ జ్యువెలర్స్ తన 61వ షోరూమ్‌ను తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులోని శ్యామల థియేటర్ వద్ద బుధవారం ప్రారంభించింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అనంత పద్మనాభన్ మాట్లాడుతూ చారిత్రక నగరంలో తమ షోరూమ్‌ను ప్రారంభించినందుకు ఎంతో సంతోషిస్తున్నామన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా తమ కస్టమర్లకు ప్రత్యేకమైన ప్రయోజనాలు, ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నామన్నారు. బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.50, బంగారు ఆభరణాల వేస్టేజిపై 20 పర్సెంట్ (వీఏ), డైమండ్ విలువపై క్యారెట్‌కు రూ.10వేలు తగ్గింపు ఇస్తున్నామన్నారు. వెండి వస్తువులు, పట్టీల మేకింగ్ చార్జీలపై 25 శాతం, అన్‌కట్ డైమండ్ విలువపై 10 శాతం తగ్గింపు పొందవచ్చన్నారు. 1964లో ప్రారంభమైన నాటి నుంచి జీఆర్‌టీ జ్యువెలర్స్ నాణ్యత పట్ల నిబద్ధత కలిగి, ప్రాంతీయ కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించిన బంగారం, డైమండ్, ప్లాటినం, వెండి జాతి రత్నాల ఆభరణాల విభిన్న ఎంపికను అందజేస్తోందన్నారు. ప్రత్యేక, శాశ్వతమైన డిజైన్లను నైపుణ్యం కలిగిన కళాకారులతో కచ్చితత్వంతో రూపొందిస్తామన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ నిజమైన హస్తకళను ప్రతిబింబించే టైంలెస్ అభరణాలను రూపొందించడం తమకెంతో గర్వంగా ఉందన్నారు. గొప్ప వారసత్వానికి, ప్రఖ్యాతిగాంచిన రాజమహేంద్రవరం వాసులకు నాణ్యత గల ఆభరణాలను అందించడమే తమ లక్ష్యమని చెప్పారు.


నిడదవోలు పోలీసులు రికవరీ చేసిన నగదు, బంగారం

గుమస్తాయే అసలు నిందితుడు

బంగారం, నగదు చోరీ కేసును ఛేదించిన నిడదవోలు పోలీసులు

నిడదవోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బంగారం, నగదు చోరీ కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు సీఐ తిలక్ బుధవారం వెల్లడించిన వివరాలు ఇలా వున్నాయి.. ఈనెల 14వ తేదీన తాడేపల్లిగూడెం నుంచి రాజమహేంద్రవరం బంగారు నగల దుకాణానికి తీసుకు వెళ్లేందుకు తన గుమస్తా అయిన అమర్‌కు షాపు యజమాని 289.340 గ్రాముల బంగారం ముక్కలను, రూ.6.30 లక్షల నగదు ఇచ్చారు. నిడదవోలు వచ్చేసరికి శెట్టిపేట ఇరిగేషన్ కార్యాలయం పొదల్లో డబ్బు, బంగారం దాచి తనపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి వాటిని దోచుకుపోయారని అతడు యజమానికి చెప్పాడు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు నిడదవోలు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అమర్ దురుద్దేశంతో పథకం ప్రకారం బంగారం నగదు దాచి దొంగతనం డ్రామాకు తెరలేపాడని తెలిసింది. అమర్‌ను విచారించగా అసలు విషయం బయటపడింది. దీంతో బుధవారం అమర్‌ను అరెస్టు చేశారు. అతడి నుంచి బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు 23.64 లక్షలు ఉంటుంది. సమావేశంలో పట్టణ ఎస్‌ఐ శోభన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


డిజిటల్ అరెస్ట్ పేరుతో చిరుద్యోగికి కుచ్చుటోపీ

మనీ లాండరింగ్‌కు పాల్పడ్డావంటూ వాట్సాప్ వీడియోకాల్‌లో బెదిరింపు

రూ.25వేలు స్వాహా చేసిన సైబర్ మోసగాడు

కరప, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ మోసగాడు ఒక చిరుద్యోగి నుంచి రూ.25వేలు స్వాహా చేశాడు. కాకినాడ జిల్లా కరప గ్రామానికి చెందిన పెనుబోతుల రాజుకుమార్ గురజనాపల్లిలోని ఒక ప్రైవేట్ కంపెనీలో చిరుద్యోగం చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం అతడు డ్యూటీలో ఉండగా ఒక అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి మీ ఆధార్ కార్డుపై ఎవరో సిమ్‌కార్డు తీసుకుని ఇల్లీగల్ యాక్టివిటీస్ (చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు) చేస్తున్నారని భయపెట్టాడు. అనంతరం మరో వ్యక్తి రాజుకుమార్ ఫోన్‌కు వాట్సాప్ వీడియో కాల్ చేసి ముంబయి పోలీసునని పరిచయం చేసుకున్నాడు. కాల్ చేసిన వ్యక్తి పోలీస్ యూనిఫామ్‌లోను, అతని వెనుక సెటప్ అంతా పోలీస్‌స్టేషన్‌ను పోలి ఉండేసరికి రాజుకుమార్ కంగారుపడ్డాడు. తన పేరు, ఆధార్ కార్డు నెంబరు కరెక్ట్‌గా చెప్పేసరికి నమ్మి సైబర్ కేటుగాడికి పూర్తిగా సహకరించాడు. మిమ్మల్ని డిజిటల్ అరెస్ట్ చేశామని, ఎవరూ లేని గదిలోకి వెళ్లాలని బెదిరించాడు. రాజుకుమార్ వద్ద మరో మొబైల్ ఫోన్ ఉందని తెలుసుకుని దాన్ని స్విచ్ఛాఫ్ చేయాలని ఆదేశించాడు. ఎనీ డెస్క్ యాప్ సాయంతో రాజుకుమార్ మొబైల్‌ను సైబర్ మోసగాడు స్వయంగా ఆపరేట్ చేస్తూ పలు ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశాడు. మనీ లాండరింగ్‌కు పాల్పడ్డావని, రూ.2.59 కోట్ల మేర లావాదేవీలు జరిపావని బెదిరించాడు. దీనిపై కేసు నమోదు చేశామని, అందుకనే డిజిటల్ అరెస్ట్ చేశామని చెపుతూ ఎఫ్‌ఐఆర్ కాపీతో పాటు మరికొన్ని పత్రాలను రాజుకుమార్‌కు వాట్సాప్ చేశాడు. కోర్టు ఫీజుల కింద వెంటనే రూ.25వేలు పంపించాలని హుకుం జారీ చేశాడు. సైబర్ కేటుగాడి మాటలకు హడలిపోయిన రాజుకుమార్ అతను చెప్పినట్టుగా తక్షణం రూ.25వేలను యూపీఐ పేమెంట్ చేశాడు. కొద్దిసేపటి తర్వాత మరో రూ.25వేలు పంపించాలని కేటుగాడు డిమాండ్ చేయడంతో ఇక తన వద్ద డబ్బులేదని కరప పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సరెండర్ అయిపోతానని రాజుకుమార్ చెప్పాడు. అయితే అంతవరకు లైన్‌లోనే ఉంటానని, అక్కడకు వెళ్లి పోలీసులకు ఫోన్ ఇవ్వాలని ఆదేశించాడు. ఫోన్ మాట్లాడుతూనే బండిపై నడకుదురు వద్దకు వచ్చేసరికి సైబర్ మోసగాడు ఫోన్ కట్‌చేసి రాజుకుమార్ వాట్సాప్‌కు అప్పటివరకు పంపిన పత్రాలు, ఇతర డేటాను పూర్తిగా డిలీట్ చేశాడు. దీంతో మోసపోయానని గ్రహించిన రాజుకుమార్ కరప పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయాన్ని ఎస్‌ఐ తోట సునీతకు తెలిపాడు. సైబర్ మోసగాడు ఇంగ్లీష్‌లో సంభాషిస్తూ రెండు గంటల పాటు తనను ఇబ్బందులకు గురి చేశాడని, మనీ లాండరింగ్‌కు పాల్పడ్డానని, ఇల్లీగల్ యాక్టివిటీస్ చేస్తున్నానంటూ బెదిరించి రూ.25వేలు కాజేశాడని బాధితుడు వాపోయాడు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయమని, 1930కు కాల్ చేసి సైబర్ కేసు నమోదు చేయాలని పోలీసులు బాధితుడికి తెలిపారు. ప్రజలు సైబర్ మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తపడాలని ఎస్‌ఐ తోట సునీత సూచించారు. సైబర్ మోసాలపై గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టనున్నట్టు ఆమె చెప్పారు.

కాగా వారం క్రితం ఒక విలేకరికి ఒక సైబర్ మోసగాడు వీడియో కాల్ చేసి ఫారిన్‌లో ఉన్న తన కుమార్తెను అరెస్టు చేశామంటూ ఇలాగే బెదిరించాడు. ఒక అమ్మాయి ఏడుపు వినిపించి డబ్బులు గుంజే ప్రయత్నం చేశాడు. అయితే అదే సమయంలో ఇంట్లోనే ఉన్న సదరు విలేకరి పెద్ద కుమార్తెతో ఫారిన్‌లో ఉన్న తన చిన్నకుమార్తె ఫోన్‌లో మాట్లాడుతుండడంతో ఫేక్ కాల్‌గా గుర్తించి ఫోన్ కట్ చేశాడు. మరలా బుధవారం మరో సైబర్ కేటుగాడు అదే విలేకరికి వీడియో కాల్ చేయగా అతను ఫోన్ కట్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



కరపకు చెందిన ఒక వ్యక్తికి బుధవారం పోలీస్ గెటప్‌లో ఉన్న వ్యక్తి వాట్సాప్ వీడియో కాల్ చేస్తున్న దృశ్యం


తేజశ్రీని అభినందిస్తున్న జనసేన నేత శ్రీనివాసరావు

టేబుల్ టెన్నిస్ అంతర్జాతీయ అంపైర్‌గా తేజశ్రీ

గొల్లప్రోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): టేబుల్ టెన్నిస్ అంతర్జాతీయ అంపైర్‌గా భీమన తేజశ్రీ ఎంపికయ్యారు. ఈమె జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌గా పని చేస్తున్న భీమన రమణమూర్తి సతీమణి. ఐస్ కర్లింగ్ క్రీడలో స్వీడన్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో తేజశ్రీ భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు. ఈ సందర్భంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో తేజశ్రీని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు అభినందించారు. ఆమె మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో రాణించి పిఠాపురం నియోజకవర్గానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు మురాలశెట్టి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశానికి గడువు పొడిగింపు

పెద్దాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలోని జవహర్ నవోదయలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 9, 11 తరగతుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువును ఈ నెల 26వ తేదీ వరకు పొడిగించినట్టు ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య తెలిపారు. దరఖాస్తుల్లో తప్పులను 27, 28 తేదీల్లో సరిచేసుకోవచ్చని చెప్పారు.

యువతికి మెసేజ్‌లు పెడుతున్నాడని...

ఓ విద్యార్థిపై ముగ్గురు మైనర్ల దాడి


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

- దాడి చేస్తూ వీడియో చిత్రీకరణ
- సోషల్ మీడియాలో వైరల్ కావడంతో
- రంగంలోకి దిగిన పోలీసులు

మలికిపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తాను ప్రేమిస్తున్న యువతికి మెసేజ్‌లు పెడుతున్నాడనే నెపంతో ఓ విద్యార్థిని ముగ్గురు మైనర్లు చావుదెబ్బలు కొట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా మలికిపురంలో ఈ నెల 5న జరిగిన ఈ దాడికి సంబంధించిన వివరాలను బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వైగోవిందరావు వెల్లడించారు. చదువు మానేసిన ముగ్గురు మైనర్లు ఈ నెల 5న మలికిపురం ఏఎఫ్‌డీటీ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఒక విద్యార్థిని మోటారు సైకిల్‌పై తీసుకువెళ్లి సత్యజ్యోతి థియేటర్ వెనుక చితకబాదారు. అమ్మాయికి ఎందుకు మెసేజ్‌లు పెడుతున్నావంటూ ఒకరి తర్వాత ఒకరు దాడి చేశారు. దీంతో విద్యార్థి చావు అంచుల వరకు వెళ్లాడు. దాడి అనంతరం మలికిపురం వేంకటేశ్వరస్వామి గుడి వద్దకు తీసుకువచ్చి వదిలారు. దెబ్బలు తిన్న విద్యార్థి తీవ్ర గాయాలపాలైనా తల్లిదండ్రులకు మాత్రం విషయం చెప్పలేదు. ఈ ఘటనను వీడియో షూట్ చేయించి ఎడిట్ చేయించగా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై మలికిపురం పోలీసులు తక్షణం స్పందించారు. ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. వీడియోలో ఉన్న వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కేసులు నమోదు చేసి జువైనల్ హోమ్‌కు పంపుతామన్నారు. విలేకరుల సమావేశంలో రాజోలు సీఐ టీవీనరేష్‌కుమార్, ఎస్‌ఐ పి.సురేష్ పాల్గొన్నారు.

చాగల్లు హైస్కూల్ హెచ్‌ఎం సస్పెన్షన్

చాగల్లు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చాగల్లు జిల్లాపరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.వీర్రాజు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు కాకినాడ ఆర్జేడీ జి.నాగమణి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారని తూర్పు గోదావరి జిల్లా డీఈవో వాసుదేవరావు తెలిపారు. వీర్రాజు విధుల్లో అలసత్వం వహించడంతో పాటు అనర్హులకు టీసీలు విక్రయించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. సస్పెన్షన్ సమయంలో జిల్లా దాటి వెళ్లరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల దారి మళ్లింపు

సామర్లకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మీదుగా విజయవాడ, విశాఖ వైపు రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారి మళ్లించినట్టు విజయవాడ రైల్వే పీఆర్వో జారీ చేసిన ఉత్తర్వులు సామర్లకోట రైల్వే అధికారులకు బుధవారం రాత్రి అందాయి. విజయవాడ సమీపాన ట్రాక్‌ల్లో రైల్వే ట్రాఫిక్ నిర్వహణ పనులు జరుగుతున్న సందర్భంగా ఈ మార్పులు చేశారు.

ధనబాద్-అలప్పుజ (13351) బొకారో ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20, 21, 22, 23, 25, 26, 27, 28, 29, 30 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది. హటియా-ఎర్నాకులం (22837) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 25న నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది. హటియా-ఎస్‌ఎమ్వీ బెంగళూరు (18637) వారాంతపు ఎక్స్‌ప్రెస్ ఈ నెల 23, 30 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది. టాటానగర్-ఎస్‌ఎమ్వీ బెంగళూరు (12889) వారాంతపు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22, 29 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది. హటియా-ఎస్‌ఎమ్వీ బెంగళూరు (12835) వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26న నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది. జాసిడి-తాంబరం (12376) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20, 27 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది.

ఏటీఎం కార్డుతో డబ్బులు రావట్లేదంటే మాయచేసి లక్షా 22వేలు కొట్టేసాడు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆవ రోడ్డుకు చెందిన సుబ్బలక్ష్మి ఈ నెల 10న తాడితోట పెట్రోలు బంకు సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో డబ్బులు తీసుకోవడానికి వెళ్లింది. కార్డు పెట్టినా డబ్బులు రాలేదు. దీంతో ఏదో సమస్య వుందని అక్కడ వున్న ఒక అపరిచిత వ్యక్తికి చెప్పింది. అతడు తాను ట్రై చేస్తానని చెప్పి కార్డు తీసుకుని మిషన్‌లో పెట్టి డబ్బులు రావట్లేదని చెప్పాడు. దీంతో సదరు మహిళ కార్డు తీసుకుని ఇంటికి వెళ్లిపోయింది. కట్ చేస్తే... ఆమె ఖాతా నుంచి దఫాదఫాలుగా రూ.1.22 లక్షలు లాగేసాడు. ఫోనుకు వచ్చిన మెసేజ్‌లను కూడా ఆమె చూసుకోలేదు. రెండు రోజుల క్రితం మెసేజ్‌లు చూసుకున్న సుబ్బలక్ష్మి కంగుతింది. బ్యాంకు వారిని కలిసి తాను మోసపోయానని తెలుసుకుని ప్రకాష్ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కిశోర్ వికాసం సదస్సు

సామర్లకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట టీటీడీసీ శిక్షణా కేంద్ర ఆవరణలో గురువారం ఐసీడీఎస్ ఆద్వర్యంలో కిశోర వికాసం పేరిట సదస్సు నిర్వమించనున్నట్టు టీటీడీసీ నిర్వాహకులు బుధవారం రాత్రి తెలిపారు. కలెక్టర్ షాన్‌మోహన అధ్యక్షతన నిర్వహించనున్న సదస్సులో జిల్లాలోని ఆరు శాఖలకు చెందిన అధికారులు హాజరవుతారని తెలిపారు.

వైద్యం వికటించి బాలిక మృతి!


అక్షయ(ఫైల్)

కొత్తపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైద్యం వికటించి 16ఏళ్ల బాలిక మృతి చెందిన సంఘటన ఉప్పాడ తీరప్రాంతంలో జరిగింది. సుబ్బంపేటకు చెందిన మృతురాలి తల్లి మైలపల్లి మల్లేశ్వరి చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. తన కుమార్తె మైలపల్లి అక్షయ(16)కు సోమవారం రాత్రి జ్వరం రావడంతో మంగళవారం ఉదయం ఉప్పాడలో ఉన్న ఆర్ఎంపీ వైద్యం చేస్తున్న మామిడి సూరిబాబు వద్దకు తీసుకెళ్లింది. ఆయన అక్షయకు 3 ఇన్‌జక్షన్లు, సిలెన్లు, గాస్(ఆక్సిజన్)పెట్టారు. గ్యాస్ ఎక్కకపోవడంతో మాత్రలు ఇచ్చి మంగళవారం రాత్రి ఇంటికి తీసుకుపొమ్మని ఆర్ఎంపీ చెప్పాడు. పాపకు బాగోలేదు పెద్ద ఆసుపత్రికి తీసుకువెళ్లండనే మాట చెప్పకుండా తీసుకుపొమ్మనడంతో చేసేదేమీలేక ఇంటికి తీసుకొచ్చిన క్షణాల్లో అక్షయ స్పృహకోల్పోవడంతో కాకినాడ పెద్దాసుపత్రికి తీసుకువెళ్లేలోగా అక్షయ ప్రాణాలు విడిచిందని తల్లి మల్లేశ్వరి తెలిపింది. పాప ఆరోగ్యం ఏమీ బాగోలేదని ముందే ఆర్ఎంపీ చెప్పిఉంటే తన కుమార్తె చనిపోయేఉండేది కాదని విలపించింది. మండలంలో ఇటీవల వేర్వేరు ఘటనల్లో ఆర్ఎంపీల వద్ద వైద్యం పొందిన నలుగురు మృతిచెందినట్టు సమాచారం.

టీడీపీ శ్రేణుల నివాళి

తాళ్లరేవు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండలాధ్యక్షుడు దున్నా సత్యనారాయణ మృతికి చింతిస్తూ సంతాపసభను ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. సత్యనారాయణ చిత్రపటానికి టీడీపీ నేతలు, కార్యకర్తలు నివాళులర్పించారు. ధూళిపూడి వెంకటరమణ, మందాల గంగసూర్యనారాయణ, వాడ్రేవు వీరబాబు, పెసింగి ఈశ్వరరావు, నడింపల్లి వినోద్, కాట్రు విశ్వేశ్వరరావు, సూరంపూడి కుమార్, ఎంపీటీసీ దంగేటి సూరిబాబు, వడ్డమూరి సతీష్, యేరుపల్లి వీరన్న, జక్కుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక సహస్ర దీపోత్సవం


దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పిఠాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటగుమ్మం సెంటర్‌లో వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సహస్ర దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వాసవి మహిళా భక్త సమాజం సభ్యులు కార్తీక దీపాలు వెలిగించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఉన్నారు.

కరపలో లక్ష బిల్వార్చన

కరప, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక పర్వతవర్ధినీదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం లక్ష బిల్వార్చన ఘనంగా జరిగింది. అన్నవరం దేవస్థానం బోర్డు మాజీ సభ్యుడు చాగంటి సూరిబాబు ఆధ్వర్యంలో వేదపండితులు హోమం, లక్షబిల్వార్చన, కుంకుమపూజ, అభిషేకాలు నిర్వహించారు. ఏకాదశవార రుద్రాభిషేకం, సూర్యనమస్కారాలు, నీరాజన మంత్రపుష్పం, తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించి ప్రసాద వితరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు విలపర్తి శ్రీనివాస్, ఫణిరాజు, వేద పండితులు గంగాధర భట్ల సూర్యనారాయణమూర్తి, గాదావర్తుల కొండయ్య సిద్ధాంతి తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో మహాయాత్ర

గొల్లప్రోలు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పార్థివ శివలింగం మహాయాత్ర బుధవారం వైభవంగా జరిగింది. ఈ మహాయాత్ర పురవీధుల్లో సాగింది. భక్తులు శివలింగాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

24న శెట్టిబలిజ కార్తీక సమారాధన

కాకినాడ సిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఈనెల 24న మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యాన అమలాపురంలో జరిగే శెట్టిబలిజ కార్తీక సమారాధన విజయవంతం చేయాలని ఉమ్మడి రాష్ట్ర వైద్యఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ మాజీ చైర్మన్, రాష్ట్ర బీసీ సంఘం ఉపాధ్యక్షుడు యనమదల రవి కోరారు. బుధవారం కాకినాడ కొండయ్యపాలెంలోని సంఘ కార్యాలయంలో మీడియా సమావేశంలో రవి మాట్లాడారు. సంఘీయులందరినీ ఐక్యపరిచి ప్రతిష్టాత్మకంగా మంత్రి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అన్ని నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లాలన్నారు. అమలాపురంలోని సత్తెమ్మతల్లి గుడివద్ద కార్తీక సమారాధన జరగనుందన్నారు. సంఘ నాయకులు కండిపల్లి వెంకటరమణ, పెంకే రాజు, అనసూరి సతీష్, కాదా శివరామకృష్ణ,సేలంకుమార్ ఉన్నారు.

'అన్నివర్గాల ప్రజలకు చేరువలో సేవలు'

గొల్లప్రోలు రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల ప్రజలకు చేరువలో ఉండి చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ద్వారా సేవలు అందిస్తున్నామని ఆ బ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో బ్యాంకు నూతన శాఖను ఆయన బుధవారం ప్రారంభించారు. ఖాతాదారులకు మరింత మెరుగుగా సేవలందించడమే తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు జనరల్ మేనేజర్లు పి.మారుతిరామ్, పి.వీరారెడ్డి, రీజనల్ మేనేజర్ డి.పాపయ్య, బ్రాంచి మేనేజరు కె.సుబ్బారావు పాల్గొన్నారు.

ఆధార్ కష్టాలు అనంతం!

ఆధార్ కష్టాలకు అంతేలేకుండా పోతోంది. తెల్లవారుజామునే వచ్చి క్యూలో నిలుచున్నా తమ వంతు వస్తుందో రాదో తెలియని పరిస్థితి. సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామని జిల్లా అధికార యంత్రాంగం ప్రకటించినా, అక్కడి ఉద్యోగులకు అదే సమయంలో ఇతర బాధ్యతలు అప్పగించడం, వారినే పాఠశాలలకు వెళ్లి ఆధార్ తీయాలని చెప్పడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. ఏ రోజు ఎక్కడ ఆధార్ తీస్తున్నారో తెలియక, సమాచారం లేక ప్రజలు ప్రధాన పోస్టాఫీసు, ఆధార్ తీసే కేంద్రాలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

తెల్లవారుజాము నుంచే పోస్టాఫీసు వద్ద బారులు

అక్కరకు రాని ప్రత్యేక కేంద్రాలు

సచివాలయ ఉద్యోగులకు అదనపు డ్యూటీలు


పిఠాపురంలో ప్రధాన పోస్టాఫీసు వద్ద ఉదయం 7.30గంటలకు బారులు తీరిన ప్రజలు


గొల్లప్రోలు మండలం చేబ్రోలులో సచివాలయంలో ఆధార్ ప్రక్రియ నిర్వహిస్తున్న దృశ్యం

పిఠాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బుధవారం ఉదయం 7.30గంటలకు పిఠాపురంలోని ప్రధాన పోస్టాఫీసు వద్ద ఆధార్ తీయించుకునేందుకు, అప్డేట్, ఇతర మార్పుల కోసం ప్రజలు బారులు తీరి నిలుచున్నారు. వారిలో కొందరు ఉదయం 5.30గంటలకే వచ్చారు. పోస్టాఫీసు తెరవగానే తమ వంతు కోసం వారికి ఈ కష్టాలు తప్పడం. వివిధ పాఠశాలల్లో చదువుతున్న తమ పిల్లలకు అపార్ కార్డుల కోసం ఆధార్‌లో మార్పులు చేర్పులకు, ఇతరత్రా అవసరాలకు, పాన్ కార్డుతో పాటు బ్యాంకు ఖాతాలు, గ్యాస్ సబ్సిడీల కోసం ఆధార్‌లో ఉన్న తప్పులను సవరించుకునేందుకు ప్రజలు అధికంగా వస్తున్నారు. సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేసినట్టు జిల్లా అధికార యంత్రాంగం ప్రకటించినా అవి ఎక్కడ ఏర్పాటు చేశారో సమాచారం లేకపోవడం, ప్రత్యేక శిబిరాలు నిర్వహించే సచివాలయ ఉద్యోగులకే ఇతర బాధ్యతలు అప్పగించడంతో పాటు వారినే పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు ఆధార్ తీయాలని చెప్పడంతో అవి ప్రజలకు అందుబాటులో లేకుండా పోతున్నాయి.

అన్ని బాధ్యతలు వారికే

పిఠాపురంలోని ఇందిరానగర్, రథాలపేట సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఒక్కొక్క కేంద్రంలో రోజుకి 30మందికి మాత్రమే ఆధార్ జారీ, మార్పులు, చేర్పుల ప్రక్రియ జరుగుతున్నది. ఈ శిబిరంలో ఉన్న సచివాలయ ఉద్యోగులకే పాఠశాలలకు వెళ్లి ఆధార్‌లు తీయాలని చెబుతుండటంతో అలా వెళ్లిన రోజుల్లో ఇక్కడ శిబిరాలు ఉండడం లేదు. దీంతో ప్రజలు పలుమార్లు సచివాలయాలు చుట్టూ తిరగాల్సి ఉంటుంది. పిఠాపురంతో పాటు నియోజకవర్గం, పరిసర ప్రాంతాల్లోని సుమారు 60 గ్రామాల ప్రజలు ఇక్కడ ఆధార్ నవీకరణ, కొత్తవాటి కోసం వస్తున్నారు. ఇంతమందికి 2సచివాలయాల్లోనే అవకాశం కల్పించడం, అది రోజూ లేకపోవడం సమస్యగా మారింది. పట్టణంలోని ప్రధాన పోస్టాఫీసుల్లో తీస్తున్నా అక్కడ ప్రజలు బారులు తీరి నిలుచుంటున్నారు. గొల్లప్రోలు, పిఠాపురం మండలాల పరిధిలోని గ్రామాల్లోనూ ఆధార్ తీయించుకునే అవకాశం లేకుండా పోయింది. నెల, రెండు నెలలుకు ఒకసారి అది మొక్కుబడిగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించడంతో వాటి వల్ల ఎవరికి ప్రయోజనం లేకుండా పోతోంది.

ఇక్కడ ఒక కేంద్రం లేదు

గొల్లప్రోలులో ఆధార్ నవీకరణ, మార్పులు, చేర్పులు, సవరణల కోసం ఒక్క కేంద్రం అందుబాటులో లేదు. పట్టణంలోని వార్డు సచివాలయాలకు ఇచ్చిన ఆధార్ పరికరాలకు మరమ్మతులు వచ్చి మూలనపడ్డాయి. గతంలో మీసేవ కేంద్రంలో ఆధార్ తీసేవారు. ఇప్పుడు ఆ సౌకర్యాన్ని ప్రభుత్వం తొలగించింది. దీంతో గొల్లప్రోలు ప్రజలు పిఠాపురం, కాకినాడ వెళ్లి ఆధార్ తీయించుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఆధార్ కోసం కనీసం వారం రోజులు పాటు తిరగాల్సి వస్తున్నదని ప్రజలు వాపోతున్నారు. పట్టణ ప్రజలకు ఆధార్ కేంద్రం ఎక్కడా అందుబాటులో లేని విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రచారం ఏది?

ఆధార్ ప్రత్యేక శిబిరాల నిర్వహణపై ప్రచారం లేకపోవడం, వస్తున్న ప్రజలు, విద్యార్థులకు అనుగుణంగా కేంద్రాలు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. పట్టణాలు, గ్రామాల్లోని ప్రతి సచివాలయంలో ఆధార్ నవీకరణకు, కొత్త వాటి జారీకి, మార్పులు, చేర్పుల ప్రక్రియకు అవకాశం కల్పిస్తే ప్రజలు కష్టాలు కొంతవరకూ తీరతాయి. ప్రస్తుతం ఒక్కొక్కరు మూడు, నాలుగు రోజులు పోస్టాఫీసులు, ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించే సచివాలయాలు చుట్టూ ప్రదిక్షిణలు చేస్తున్నారు. ఈ పరిస్థితిపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రమాదకరంగా సెంట్రల్ లైటింగ్ స్తంభం


పెద్దాపురంలో ఒరిగిపోయి ఉన్న స్తంభం

పెద్దాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక దర్గాసెంటర్ వద్ద ఉన్న సెంటర్ లైటింగ్ విద్యుత్ స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఆప్రదేశంలో స్తంభం ఈ పరిస్థితిలో ఉండడంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. తక్షణం అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

'జనవాణి'లో కాకినాడ ఎంపీ

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు మంగళగిరిలో జనసేన కేంద్ర కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన జనవాణి(జనసేన భరోసా) కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ పాల్గొని పలు అర్జీలు స్వీకరించి సమస్యలు నమోదు చేసుకున్నారు. తక్షణ పరిష్కారం అవసరమైన అర్జీలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, నాయకులు పాల్గొన్నారు.

పిఠాపురంలో అగ్నిప్రమాదం

పిఠాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మున్సిపల్ కల్యాణమండపం ఆవరణలో బుధవారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. మంటలు చెలరేగడంతో షామియానాలు, ఇతర సామాగ్రితో పాటు మోటార్‌సైకిల్ పాక్షికంగా దగ్ధమైంది. సుమా రు రూ.లక్ష ఆస్తి నష్టం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెనుప్రమాదం తప్పింది. మండపం పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులు గోడ బాంబులు పేల్చడంతో నిప్పు రవ్వలు ఎగిసి డెకరేషన్ బరకా అంటుకుని మంటలు వ్యాపించినట్లు చెబుతున్నారు.

15 మద్యం సీసాల స్వాధీనం

పిఠాపురం రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం చిత్రాడ గ్రామంలో నిర్వహిస్తున్న మద్యం బెల్ట్‌షాపుపై ఎక్సైజు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని దాసరి రామును అరెస్టు చేశారు. ఎక్సైజ్ ఏఈ, ఈఎస్ ఆదేశాల మేరకు ఈ దాడులు జరిగాయి. కొత్తపల్లి మండలం రావివారిపోడు గ్రామంలో గుత్తుర్తి రాజుని అరెస్టు చేసి 10లీటర్ల సారా స్వీధీనం చేసుకున్నట్లు ఎక్సైజు సీఐ శివరామరాజు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ లక్ష్మీతులసీ, స్టేషన్ ఎస్ఐ విజయకుమార్ పాల్గొన్నారు. మద్యం షాపుల్లో అధిక ధరలకు విక్రయించినా, బెల్టుషాపులు నిర్వహించినా, సారా అమ్మినా కాకినాడ కార్యాయయం ఫోన్ 0884 2376227కు సమాచారం అందించాలని కోరారు.

దేవదాయ శాఖ అధికారులు ప్రత్యేక పూజలు

సామర్లకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ ట్రిబ్యునల్ సభ్యులు, పెదకాకాని, అమరావతి, ట్రిబ్యునల్ స్టాండింగ్ కౌన్సిల్ అయిన ముప్ప పద్మ తదితర దేవదాయ శాఖ అధికారులు బుధవారం రాత్రి సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో భీమేశ్వరస్వామికి అభిషేకపూజలు, బాలాత్రిపుర సుందరి అమ్మవార్లకు కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈవో నీలకం ఠం ఆధ్వర్యంలో అర్చకస్వాములు వేదాశీర్వచనంతో ప్రసాదాలు స్వామి,అమ్మవార్ల చిత్రపటాలను అందజేశారు.

పైపులైన్లకు నిధులు మంజూరు చేయాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే నానాజీ ప్రస్తావన


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అధ్వాన్నా...కాకినాడ రూరల్లో తాగునీటి పంపిణీ అస్తవ్యస్తంగా ఉంది. 1990లో ఏర్పాటు చేసిన పైపులైన్లు శిథిలావస్థకు చేరడం, పైపులైన్ల, డ్రైనేజీల నుంచి వస్తున్న లీకేజీలతో ఈస్ట్‌మన్ కలర్‌లో తాగునీరు సరఫరా అవుతోంది. ఏ గ్రామానికెళ్లినా ఇదే సమస్యపై ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పూర్వం ఏర్పాటు చేసిన పైపులైన్లు పెద్ద ఎత్తున మార్చి మెరుగైన సురక్షిత మంచినీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలంటూ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) బుధవారం అసెంబ్లీలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో సభాధ్యక్షుడు దృష్టికి మంచినీటి సమస్యను ప్రస్తావించారు. గత నాలుగైదు నెలలుగా గ్రామాల్లోకెళుతుంటే తాగునీటి సరఫరాపై ప్రజలు ఇదే విషయాన్ని ఎత్తిచూపుతున్నారన్నారు. 145 ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించి, క్లోరినేషన్ తదితర ప్రక్రియ చేసినా ఈస్ట్‌మన్ కలర్‌గా తాగునీరు సరఫరా అవుతుందన్నారు. 1990లో ఏర్పాటు చేసిన పైపులైన్లు కావడం పైపులైన్లు, డ్రైనేజీల నుంచి లీకేజిలు ఏర్పడి తాగునీరు కలుషితం అవుతుందన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలకు నాణ్యమైన మంచినీరు సరఫరా చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లల్లో ఏనాడు వైసీపీ ప్రభుత్వం ట్యాంకులు శుభ్రం చేయలేదని, పైపులైన్లకు మరమ్మత్తులు చేసినా పాపాన పోలేదన్నారు. క్లీనింగ్ చేసిన పాపాన పోలేదన్నారు. మున్సిపాలిటీల్లో తాగునీటి నిర్వహణ అంతా వాటర్ వర్క్స్ విభాగం చూసుకుంటుందని, గ్రామీణ ప్రాంతాల్లో అలాంటి పరిస్థితి లేదని, నిధులు లేక ఇబ్బంది ఉందన్నారు. ప్రజలకు నాణ్యమైన మంచినీరు సరఫరా కోసం పైపులైన్లు మార్చేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు స్పీకర్ రఘురామకృష్ణంరాజు బదులిస్తూ మంచినీరు ఇచ్చేది పవన్‌కల్యాణ్ అంటూ ముగింపు ఇచ్చారు.

అదుపులో పత్తిపై పిండినల్లి

జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్


దుర్గాడలో పత్తిపొలాలను పరిశీలిస్తున్న విజయకుమార్

గొల్లప్రోలు రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పత్తిపై ఉధృతంగా ఆశించిన పిండినల్లి ప్రస్తుతం అదుపులో ఉందని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ తెలిపారు. శాస్త్రవేత్తల సూచనలకు అనుగుణంగా సస్యరక్షణ చర్యలు చేపట్టిన పత్తిపంటలో నల్లి అదుపులోకి వచ్చినట్లు గుర్తించామని చెప్పారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో రైతులు తొలగించిన పత్తి పొలాలను, పిండినల్లి ఆశించి సస్యరక్షణ చేపట్టిన పత్తి పంటను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం కేళీలు వచ్చిన ఆర్‌జీఎల్ 2537 వరి విత్తనాలు వేసిన పంటపొలాలను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఏపీ సీడ్స్ ప్రతినిధులు శుక్రవారం వస్తారని తెలిపారు. చదరపు మీటరుకు ఎన్ని దుబ్బులు ఉన్నాయి, వాటి సాంద్రత తదితర వివరాలను పంపాలని రైతుసేవాకేంద్రం సిబ్బందిని ఆయన ఆదేశించారు. మార్కెట్‌లో పత్తి రేటు తక్కువగా ఉన్నందున వ్యవసాయ మార్కెట్‌కమిటీ ద్వారా కొనుగోలు చేస్తామని తెలిపారు. పత్తి తర్వాత వేసే నువ్వులను రైతు సేవా కేంద్రం ద్వారా అందజేస్తామన్నారు. వ్యవసాయశాఖ ఏడీ పి.స్వాతి, ఏవో కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు


పెద్దాపురంలో మాట్లాడుతున్న ఆర్డీవో, పిఠాపురంలో బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసిన దృశ్యం

పెద్దాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఆర్డీవో కత్రెడ్డి శ్రీరమణి అన్నారు. బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రంథాలయాలు మానవ జీవితాన్ని ఏవిధంగా తీర్చిదిద్దుతాయో విద్యార్థులకు వివరించారు. పుస్తక పఠనమే జీవితాన్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందన్నారు. అనంతరం సాహితీ మూర్తులు గ్రంథాన్ని సాహితి స్రవంతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జ్యోశ్యుల కృష్ణబాబు ఆర్డీవోకు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ డి.శ్రీహరిరాజు, గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య, భళ్లమూడి సూర్యనారాయణ, అభ్యుదయ కవి చల్లా విశ్వనాథం, హెచ్ఎం గోపాలకృష్ణ పాల్గొన్నారు.

కాకినాడ రూరల్: కాకినాడ ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిశాయి. విద్యార్థులకు అనేక పోటీలు నిర్వహించారు. ముగింపోత్సవ కార్యక్రమంలో కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు ముఖ్యఅతిథిగా జ్యోతిప్రజ్వలనచేసి ప్రారంభించారు. కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీయివీఎల్ నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు విజ్ఞానసమాచారాన్ని అందించడానికి గ్రంథాలయాలను పరిరక్షించాలని సూచించారు. పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్స్ కె.కరుణ, డి.బ్యూలా, షాహిద్దీన్, కళాశాల చీఫ్ లైబ్రేరియన్ యస్వీప్రభాకర్ ఉన్నారు.

కరప: వేళంగి, కరప శాఖా గ్రంథాలయాల్లో వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. డాక్టర్ బొండా వెంకన్నరావు, మెర్ల వీరయ్యచౌదరి, జనవిజ్ఞానవేదిక జిల్లా ప్రధానకార్యదర్శి వి.రామారావు, కార్యదర్శి పినిశెట్టి వీరభద్రరావు, మాజీసర్పంచ్ పోలిశెట్టి తాతీలు, హెచ్ఎం కె.ఈశ్వరరావు, లైబ్రేరియన్ పాట్నీడి వెంకటరంగయ్య, ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.

పిఠాపురం: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన, దేశభక్తి గేయాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఉపవిద్యాశాఖాధికారి ఇ.ప్రభాకరశర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం జీవీఆర్‌కే మూర్తి, సూర్యరాయ గ్రంథాలయం కార్యదర్శి కొండేపూడి శంకరరావు, బీఎంఆర్ బాలికోన్నత పాఠశాల పీడీ సత్యప్రియ, గ్రంథాలయాధికారి ఆర్. వెంకటరాము తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని కొత్తపల్లి ఎంఈవో-2 పైడిరాజు అన్నారు. ఉప్పాడశాఖా గ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాసరచన, పుస్తకపఠనం, రంగవల్లులు పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. గ్రంథాలయవారోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులకు, ఇతర పెద్దలకు గ్రంథాలయ అధికారిణి తెల గంశెట్టి నళినీప్రియ అభినందనలు తెలియజేశారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

'రైతు వ్యతిరేక విధానాలపై సమరశంఖం'


సదస్సులో ఐక్యత చాటుతున్న నాయకులు

కాకినాడ సిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మోదీ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై సమరశంఖం పూరించాలని, ఈనెల 26న జిల్లా కేంద్రాల్లో తలపెట్టిన ధర్నాలను విజయవంతం చేయాలని కార్మిక, రైతు సంఘాల నేతలు పిలుపునిచ్చారు. కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 26న దేశవ్యాప్త ఆందోళనలను విజయవంతం చేయాలని కోరుతూ కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో కాకినాడ కచేరీపేట యూటీఎఫ్ హోంలో జిల్లా ఉమ్మడి సదస్సు బుధవారం నిర్వహించారు. తొలుత వివిధ ప్రజా సంఘాల నాయకులను ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ ఆహ్వానించారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరెడ్డి, పప్పు ఆదినారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మోర్తా రాజశేఖర్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ పదేళ్ల పాలనలో రైతుల ఆత్మహత్యలు ఎక్కువయ్యాయన్నారు. పరిశ్రమల్లో కార్మికులకు బానిసల కంటే దారుణమైన పరిస్థితులు ఉన్నాయన్నారు. ఏ రంగంలో పని చేసే కార్మికుడికైనా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. వివిధ సంఘాల నాయకులు తాళ్లూరి రాజు, గుబ్బల ఆదినారాయణ, చెక్కల రాజ్‌కుమార్, గొడుగు సత్యనారాయణ, సత్యనారాయణ, కేఎస్ శ్రీనివాస్, ఏరుబండి చంద్రావతి, నర్ల ఈశ్వరి పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం

తాళ్లరేవు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పి.మల్లవరం కృషి అమృత్ గోవు ఆధారిత ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో తొలకరి పంట బర్మా బ్లాక్ వరిసాగు పంటకోత ప్రయోగాన్ని అధికారులు, ప్రకృతి వ్యవసాయ రైతులు బుధవారం నిర్వహించారు. 5.5 మీటర్లు విస్తీర్ణంలో పంటకోత ప్రయోగం చేయగా అధికారులు ఎకరాకు 22బస్తాలు దిగుబడి వచ్చినట్టుగా ధ్రువీకరించారు. ప్రకృతి వ్యవసాయ సాగు ప్రతినిధులు ఎంటి ధనలక్ష్మి, వెంకటలక్ష్మి, సతీష్, వాడపల్లి, భవాని ప్రకృతి సేద్యంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు దడాల సత్తికొండ, విశ్వ సత్యనారాయణ, రాజరాజు, సింహాచలం, గుత్తుల మహేష్, కొండ, చిన్న, అబ్బిరెడ్డి నాగేశ్వరరావు, ఆనాల పాపారావు, పంపన రామకృష్ణ, నాగభూషణం, వుండ్రు చినబాబు, ప్రకృతి ప్రతినిధులు అజయ్, సుధ, అనీల్‌చంద్ర తదితరులు ఉన్నారు.

'ఆ జీవో రద్దు చేయాలి'

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి కలెక్టర్ షాన్‌మోహన్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ ధర్నాని ఉద్దేశిస్తూ వీవోఏ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు బేబిరాణి మాట్లాడుతూ మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న యానిమేటర్లను తొలగించాలని ఇచ్చిన కాలపరిమితి సర్క్యులర్‌ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యనిమేటర్లపై రాజకీయ వేధింపులు, తొలగింపులు పెరిగిపోయాయన్నారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంగాభవాని, ఈశ్వరిబాయి, కోశాధికారి మేరీ, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రవతి ఉన్నారు.

'పాస్టర్లకు గౌరవ వేతనం అమలు చేసినందుకు రుణపడి ఉంటాం'

కాకినాడ సిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): థాంక్యూ సీఎం సార్.. పాస్టర్లకు గౌరవ వేతనం అమలు చేసినందుకు రుణపడి ఉంటామని నేషనల్ క్రిష్టియన్ కౌన్సిల్ కాకినాడ జిల్లా ప్రతినిధులు అన్నారు. కాకినాడ దుమ్ములపేట విక్టరీ రివైవల్ సెంటర్‌లో బుధవారం థాంక్యూ సీఎం సార్.. నినాదంతో విలేకరుల సమావేశం నిర్వహించారు. కౌన్సిల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు మోసా అబ్రహం, కాకినాడ సిటీ అధ్యక్ష ఉపాధ్యక్షులు బిషప్ రత్నబాబు, ప్రభాకర్, జిల్లా చిల్డ్రన్స్ వింగ్ అధ్యక్షుడు కాశరపు సింహాద్రి మాట్లాడారు. గత ప్రభుత్వంలో మొదటిసారి పాస్టర్ల గౌరవ వేతనం ఆరు నెలలకు రూ.22 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. కూటమి ప్రభుత్వం రూ.29కోట్లు కేటాయించి పాస్టర్లకు అండగా నిలిచిందన్నారు. అందరి పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు అని కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కౌన్సిల్ జిల్లా కోఆర్డినేటర్ ఉదయ్‌కుమార్, సిటీ కోశాధికారి సామ్యూల్, సంయుక్త కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

ఎక్సైజ్ విభాగంలోని ఐయంయల్ డిపోలో ఫర్నిచర్‌ను ఈ నెల 25న ఉదయం 10 గంటలకు వేలం వేస్తామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీమతి కృష్ణకుమారి గారు మరియు డిపో మేనేజర్ సిహెచ్.రమణబాబు గారు (ఇంఛార్జి) తెలిపారు. గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉపయోగించిన ఫ్రిజర్లు-133, ఇన్వర్టర్ మరియు బ్యాటరీ-149, క్యాస్ చెస్ట్-166, స్కానర్లు-332, క్యాష్‌కౌంటింగ్ మిషన్లు-166, వీటికి సంబంధించి వేలం ప్రక్రియలో పాల్గొనదలచినవారు ఏపీఎస్బీసీఎల్ డిపోను సంప్రదించాలని కోరారు. పూర్తి సమాచారం కోసం 9949351051, 8886262201 నంబర్లలో సంప్రదించాలన్నారు.
వేలం వేయు ప్రదేశము: **కటకం బాబు గారి గొడౌన్, విమల్ డ్రింకింగ్ ఫ్యాక్టరీ ప్రక్కన, సామర్లకోట**

డిపో మేనేజర్ I/C
ఐఎంఎల్ డిపో, సామర్లకోట

'సీవోపీడీ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి'

సామర్లకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీవోపీడీ వ్యాధి) మనుషుల ఊపిరితిత్తులకు వచ్చే దీర్ఘకాలికవ్యాధి అని, 65 ఏళ్ల పైబడిన వృద్ధులోనే కాదు చిన్నారులకు సైతం వచ్చే అవకావాలు ఉన్నాయని ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని పల్మనాలజిస్ట్ డాక్టర్ భీమశంకరం వెల్లడించారు. ప్రపంచ సీవోపీడీ దినోత్సవం సందర్భంగా బుధవారం సామర్లకోట మండలం పనసపాడు ఏడీబీ రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్ నందు నిర్వహించిన ప్రత్యేక అవగాహనా సదస్సులో భీమశంకరం మాట్లాడుతూ ఈ వ్యాధితో శ్వాసనాళాలు, లంగ్ టిష్యూ యాల్వీ యోలై బాగా దెబ్బతింటాయన్నారు. ఊపిరితిత్తులకు గాలిని తీసుకెళ్లే వాయు మార్గాలను ప్రభావితం చేస్తుందన్నారు. దీంతో రోగి శ్వాస తీసుకునేందుకు చాలా ఇబ్బందులు పడతాడన్నారు. దగ్గు, శ్లేష్మం, గురక వంటి సమస్యలు ఎదురవుతాయన్నారు. గుండె సంబంధిత వ్యాధులు, గుండెపోటు, ఊపిరితిత్తుల కేన్సర్లతో మరణాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. ఈ వ్యాధికి సంబంధించి పరీక్షలు స్వల్పరుసుముతో అందించే పోస్టర్‌ను ఆవిష్కరించారు. డాక్టర్ వసంతకుమార్, డాక్టర్ జగదీశ్వరరావు, మెడికవర్ సెంటర్ హెడ్ డాక్టర్ గౌతమ్‌రామ్, ఆపరేషన్ మేనేజరు ఖాత్రిలు పాల్గొన్నారు.


మెడికవర్ ఆసుపత్రిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యబృందం

'ఆన్‌లైన్ మోసాలతో అప్రమత్తం'

తుని రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తుని ఎస్ఐ విజయ్‌బాబు స్పష్టం చేశారు. స్థానిక వివేకా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డిజిటల్ మోసాలపై బుధవారం ఆయన అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయన పలు విషయాలను వివరించి జాగ్రత్తగా ఉండాలన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

వీవోఏల కాల పరిమితి విధానాన్ని రద్దు చేయాలి



ఐటీడీఏ వద్దకు ర్యాలీగా బయలుదేరిన వీవోఏలు

చింతూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వీవోఏ (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్)ల విధుల కాలపరిమితి ఉత్తర్వును రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం చింతూరులో డివిజన్ స్థాయి వీవోఏలు డిమాండ్లు నెరవేర్చాలని ర్యాలీగా ఐటీడీఏ వద్దకు వెళ్లి ధర్నా చేశారు. ఈసందర్భంగా వెంకట్ మాట్లాడారు. రాష్ట్రంలో 28వేల మంది వీవోఏలు ఉన్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వారి కాలపరిమితిని మూడేళ్లకు కుదిస్తూ ఉత్తర్వులిచ్చారన్నారు. ఈనేపథ్యంలో ప్రతి మూడేళ్లకోసారి పాత వారిని తొలగించి కొత్తవారికి అవకాశం కల్పిస్తారన్నారు. దీంతో వారంతా ఉపాధికి దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వును తొలగిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చినందున ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వెంకట్ డిమాండ్ చేశారు. వీఏవోలకు బకాయిలను వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐటీడీఏ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి పొడియం లక్ష్మణ్, వీవోఏల సంఘ జిల్లా అధ్యక్షుడు గొర్రె లక్ష్మయ్య, చింతూరు డివిజన్ నాయకులు దూలమ్మ, దుర్గాదేవి, శ్రీను, లీలావతి, కొండమ్మ, జ్యోతి, మని, సుందరి, బాబు, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లను కొనసాగించాలి

చింతూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వలంటీరు వ్యవస్థను కొనసాగించాలని ఏపీ గ్రామ/వార్డు వలంటీర్ల యూనియన్ గౌరవాధ్యక్షుడు పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం చింతూరులో సంఘ సమావేశం జరిగింది. ఈసందర్భంగా వెంకట్ మాట్లాడుతూ వలంటీరు వ్యవస్థను కొనసాగిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. శాసనమండలి సమావేశంలో వలంటీర్ల విషయమై మాట్లాడిన మంత్రి తన మాటల్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో రూ.10వేల వేతనం చెల్లిస్తామన్న మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. హామీని నెరవేర్చని పక్షంలో వలంటీర్లతో అసెంబ్లీని ముట్టడిస్తామన్నారు. సంఘ నాయకులు పొడియం లక్ష్మణ్, పొడియం జాని, కలుముల మహేష్, సోడి ప్రసాద్, గంగరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేలకోటలో ఐటీడీఏ పీవో ఆకస్మిక తనిఖీ



అడవి మార్గంలో వస్తున్న ఐటీడీఏ పీవో

మోతుగూడెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పరిధిలోని కొత్తపల్లి పంచాయతీ నేలకోట గ్రామాన్ని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భారత్ బుధవారం సందర్శించారు. ఇక్కడి సమస్యలపై గ్రామస్తులను, టీడీపీకి చెందిన కొత్తపల్లి మాజీ సర్పంచ్ కరణం లక్ష్మయ్యని అడిగి తెలుసుకున్నారు. నేలకోట నుంచి మోతుగూడెం వరకు రోడ్డు వేయాలన్నారు. అనారోగ్య సమస్యలు వస్తే నేలకోట నుంచి గొడ్లగూడం పీహెచ్‌సీకి 16కిలోమీటర్లు, మోతుగూడెం పీహెచ్‌సీకి ఐదు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందన్నారు. మెరుగైన వైద్యం కోసం నేలకోట నుంచి మోతుగూడెం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని పీవోకు విజ్ఞప్తి చేశారు. వారి సమస్యలను విన్న భరత్ నేలకోట నుంచి మోతుగూడేనికి అడవి మార్గాన ఐదు కిలోమీటర్లు నడుచుకుంటూ వచ్చారు. మార్గమధ్యంలో మోతుగూడెం టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు పీవోని మర్యాదపూర్వకంగా కలిసి మోతుగూడెం, నేలకోట రోడ్డు నిర్మాణం గురించి వివరించారు. అనంతరం వాగు దాటుకుంటూ వచ్చి మోతుగూడెం ఎస్టీ కాలనీ గిరిజనులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ 1970ల్లో పొలాలు తడిపేందుకు అధికారులు మోటారు ఇచ్చారని... 60ఎకరాలు సాగు చేసే అది కొద్ది కాలంగా పనిచేయట్లేదన్నారు. అనంతరం ఎస్టీ కాలనీలోని మహిళలు పీవోను కలిసి డ్రైనేజీ సమస్యను వివరించారు. ఇందుకు పీవో స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడతానని, సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయండి

దేవీపట్నం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని పూడిపల్లి సర్పంచ్ కలుం నర్సాయమ్మ కోరారు. బుధవారం రంపచోడవరం ఐటీడీఏ పీవో, సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు. మండలంలో ఆధార్ సెంటర్ లేక చాలా మంది విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆధార్ అప్‌డేట్ చేయించుకోవడానికి మైదాన ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని, అక్కడ ఖాళీ లేకపోవడంతో వెనుదిరిగి వస్తున్నారన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయండి

దేవీపట్నం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇందుకూరు-1లో ఉన్న పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామం మంటూరుకు అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ కోరారు. ఈగ్రామంలో 172కుటుంబాలున్నాయని, ప్రీస్కూల్, అంగన్‌వాడీ పిల్లలు 21మంది ఉన్నా అంగన్‌వాడీ కేంద్రం మంజూరు కాలేదన్నారు. మంటూరు, ఏనుగులగూడెం నిర్వాసితులకు వేర్వేరుగా గ్రామాలు నిర్మించినప్పటికీ అంగనావాడీ కేంద్రం ఒక చిన్న బిల్డింగ్‌లో నిర్వహించడంతో ఇబ్బందిగా ఉందన్నారు. అధికారులు దీనిపై ఆలోచించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు యలగాడ నాగేశ్వరరావు, కారం రామన్నదొర, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

దేవీపట్నం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నామని, రైతులు ఈఅవకాశాన్ని ఉపయోగించుకోవాలని రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ అన్నారు. బుధవారం ఇందుకూరుపేట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. రైతులతో కొన్ని ముఖ్య విషయాలు మాట్లాడారు. ఈసందర్భంగా సబ్‌కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ ఈప్రాంతంలో ఎక్కువగా వరి పండిస్తున్నందుకు మొదటిగా ఇక్కడ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ప్రభుత్వం ద్వారా పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నామన్నారు. ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు. గోనె సంచులు అందుబాటులో ఉంటాయని, రవాణా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన సమస్యలు తహశీల్దార్, వ్యవసాయశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లాలని, ఇక్కడ పరిష్కారం కాకపోతే రంపచోడవరం సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వచ్చి సమస్యలను వివరించవచ్చన్నారు. రైతులు అవసరమైన అన్ని సహాయ, సహకారాలు ప్రభుత్వం ద్వారా అందిస్తామని చెప్పారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

వై.రామవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వై.రామవరం శాఖా గ్రంథాలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న 57వ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. గ్రంథాలయాధికారిణి జర్తా సత్యవతి ఆధ్వర్యంలో వారం రోజులు విద్యార్థులకు కవి సమ్మేళనాలు, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరకృప చేతుల మీదుగా బహుమతులు అందించారు.

విద్యుత్ బిల్లుల సొమ్ములు స్వాహా

కూనవరం, వీఆర్‌పురం మండలాల ఆర్‌సీ సస్పెండ్: స్వాహా చేసిన సొమ్ము రూ.లక్షల్లో



విచారణ నిర్వహిస్తున్న విద్యుత్ శాఖాధికారులు

కూనవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో విద్యుత్ బిల్లుల సొమ్ములు స్వాహా అయ్యాయి. కూనవరం, వీఆర్‌పురం మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారుల బిల్లుల సొమ్ములను విద్యుత్ శాఖ రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న ఆర్‌సీ భరత్ స్వాహా చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈనేపథ్యంలో భరత్‌ను సస్పెండ్ చేసినట్లు విద్యుత్ శాఖాధికారులు ఆంధ్రజ్యోతికి తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలివి. మూడు నెలలగా విద్యుత్ బిల్లుల్లో అవకతవకలు జరుగుతున్నాయి. సుమారు రూ.30లక్షల నుంచి రూ.40లక్షల సొమ్ము స్వాహా అయినట్లు సమాచారం. ఆ శాఖకు సంబంధించిన రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న ఆర్‌సీ భరత్ వినియోగదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నా అవి మాత్రం సంబంధిత శాఖలో జమ చేయడంలేదు. వచ్చిన నగదును అరకొరగా మాత్రమే జమచేశాడు. అయితే కూనవరం, వీఆర్‌పురం నుంచి విద్యుత్ బిల్లులు వసూళ్లు తక్కువగా రావడంతో అధికారులకు అనుమానం వచ్చింది. అంతేకాకుండా వినియోగదారులు ఒక నెలలో కట్టిన బిల్లుకు మళ్లీ అదే నెలకు బిల్లు రావడంతో స్థానిక విద్యుత్ అధికారులను వినియోగదారులు ప్రశ్నించారు. దీనిపై స్థానికాధికారులకు అనుమానం రావడంతో ఈవిషయాన్ని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఏఏఓ కె.రవీంద్ర, జేఏఓ ప్రసాద్, సీహెచ్ విశ్వనాథ్ కూనవరం మండలం వచ్చి విచారణ చేపట్టారు. దీంతో వినియోగదారులు తమకు జరిగిన నష్టాన్ని అధికారులకు వివరించారు. వినియోగదారులు ఆందోళన చెందవద్దని, దీనిపై పూర్తి విచారణ చేపడుతున్నట్లు, వినియోగదారులకు న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఏఏఓ రవీంద్ర ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ విద్యుత్ బిల్లుల నగదు స్వాహా చేసినట్లు గుర్తించామని, సంబంధిత ఆర్‌సీ భరత్‌ను విధుల నుంచి తొలగించామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ రాజ్‌కపూర్, సిబ్బంది ఉన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

సచివాలయానికి దారేది?

కత్తిపూడిలో నిలిచిపోతున్న వర్షపు నీరు, ప్రజలకు ఇబ్బందులు



శంఖవరం మండలం కత్తిపూడిలో బ్రిడ్జి కింద నిలిచిపోయిన వర్షపు నీరు

శంఖవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కత్తిపూడి సచివాలయానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కత్తిపూడి నుంచి దుర్గాడ వెళ్లే మార్గంమధ్యలో జాతీయ రహదారి బ్రిడ్జ్ క్రింద చినపాటి వర్షానికే నీరు నిలిపోతుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. వివిధ పనుల నిమిత్తం గ్రామస్తులు నిత్యం సచివాలయానికి రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి నీటమునిగిపోవడంతో వారు అవస్థలు పడుతున్నారు. దీనిపై అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

'విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి'

ప్రత్తిపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, జీవిత లక్ష్యాలను విద్యార్థి దశలోనే నిర్దేశించుకోవాలని ప్రత్తిపాడు జడ్జి కాటం భాను కోరారు. జాతీయ బాలల దినోత్సవ వారోత్సవాలు ముగింపు సందర్భంగా ప్రత్తిపాడులోని సోషల్ వెల్ఫేర్‌బాలుర వసతిగృహాన్ని బుధవారం ఆయన సందర్శించి విద్యార్థుల విద్యాబోధన సామర్థ్యాలు పరిశీలించారు. సైన్స్, సోషల్, లెక్కల సబ్జెక్టుల్లో ప్రశ్నలు వేసి సరిగ్గా సమాధానాలు చెప్పిన వారికి బహుమతులు అందజేశారు. బాలబాలికలకు బిస్కెట్లు పంపిణీ చేశారు.

సత్యదేవుని గ్రామోత్సవం

ప్రత్తిపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో బుధవారం సత్యదేవుని పల్లకిలో ఊరేగించి గ్రామోత్సవం నిర్వహించారు. సత్యదీక్ష ప్రచార కర్త నల్లమిల్లి కృష్ణబాబు, అన్నవరం దేవస్థానం మాజీ ట్రస్టు మెంబర్ సింగిలిదేవి సత్తిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బుద్ధ గంగాపార్వతి, దాడిశెట్టి శేషగిరి, కందా నారాయణ రావు, వాడపల్లి కృష్ణ, మద్దాల దేవి, సత్యదీక్ష ధారణ భక్తులు ఉన్నారు.

శబరిమలకు పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న శివాజీ స్వామి

కోటనందూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన చింతకాయల శివాజీ శబరిమలకు పాదయాత్రగా బయలుదేరాడు. బుధవారం దుర్గాదేవి ఆలయంలో పూజలు చేసి పయనమయ్యాడు. ఇప్పటికి 11 సార్లు మాల వేసుకోగా 9సార్లు వనయాత్ర చేశానని, గతేడాది సైకిల్‌పై వెళ్లగా ఈ ఏడాది పాద యాత్ర చేస్తున్నట్టు తెలిపారు. గురుస్వాములు అర్రి శ్రీనివాస్, వాసిరెడ్డి వెంకటరామమూర్తి సంఘీబావం తెలిపారు.

'ప్రభుత్వ రాయితీలు వినియోగించుకోవాలి'

శంఖవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బిందు, తుంపర సేద్యంలో ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులు వినియోగించుకోవాలని జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి జీవివి ప్రసాదరావు తెలిపారు. బుధవారం మండలంలో పలు గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. సబ్సిడీపై ఆసక్తి ఉన్నవారు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. తుంపర సేద్యం రిజిస్ట్రేషన్లు పూర్తిచేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పామాయిల్ సాగులో అంతర్ పంటలలో సస్యరక్షణ, చర్యలపై అవగాహన కల్పించారు. కార్యకమంలో వ్యవసాయాదికారి పి.గాంధీ, ఉద్యానవనశాఖాదికారి పి.అరుణ్‌కుమార్, ప్రభాష్ తదితరులు ఉన్నారు.

రైతులకు సాగు నీరందించడమే లక్ష్యం

కౌన్సిలర్ అలమండ చలమయ్య



సమావేశంలో మాట్లాడుతున్న చలమయ్య

ఏలేశ్వరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతాంగానికి సాగు నీరు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కౌన్సిలర్ అలమండ చలమయ్య అన్నారు. బుధవారం పట్టణంలో చలమయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు సమస్యలను శాసన సభలో చర్చించిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తీరుకు సంతోషంగా ఉందన్నారు. రైతాంగం ఎదుర్కుంటున్న పలు సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించడం జరిగిందన్నారు. మెరక ప్రాంతమైన మండలంలోని జె.అన్నవరం, తూర్పులక్ష్మీపురం, గొంటువాని పాలెం తదితర గ్రామాలను కలిపి రిజర్వాయర్ నీరు రైతాంగానికి అందించగలిగితే నియోజక వర్గంలో రైతులు పంటలు పండించుకుని అత్యధిక దిగుబడి సాధిస్తారన్నారు. రైతులను అన్నివిధాలా ఆదుకునేలా ఎమ్మెల్యే సత్యప్రభ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారని పేర్కొన్నారు. సమావేశంలో బోద చిరంజీవి, కడిమిశెట్టి వాసు, జామి ఆదినారాయణ, బెల్లాని శ్రీను, కాకాడ నాగేశ్వరరావు, ఒంజరపు బ్రహ్మం పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



ప్రత్తిపాడులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం, జగ్గంపేటలో బహుమతి ప్రదానం

అన్నవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పుస్తకపఠనం ద్వారా జ్ఞాన సముపార్జనతో పాటు మనిషి జీవనప్రమాణాలు మెరుగుపడతాయని స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవికె.మెహర్ పేర్కొన్నారు. బుధవారం తొండంగి మండలం కె.పెరుమాళ్లపురంలో గ్రంథాలయ ముగింపు వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. అనంతరం క్విజ్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో పి.దివాకరరావు, టి.రాము, ఆర్ జగదీష్, పీవి కృష్ణారావు తదితరులున్నారు.

ప్రత్తిపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు బుధవారం ముగిశాయి. విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు స్థానిక ఆదర్శ విద్యాలయ అధినేత దాడి చిన్నారావు బహుమతులు అందజేశారు. దాడి వెంకటరమణ, గ్రంథాలయ అధికారి సన్యాసి ఉన్నారు.

జగ్గంపేట: జగ్గం పేట గ్రంథాలయంలో నిర్వహించిన వివిధ పోటీలలో విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశా రు. శ్రీచంద్రమౌళి వెంకట శాస్త్రి, రిటైర్డ్ ఉపాధ్యాయుడులు తోలేటి సూర్యనారాయణ, మల్లేశ్వర రావు, జిగిని అనురాధ దేవి, అక్షర విద్యాలయ, శ్రీ స్వామి వివేకానంద విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి ఉదయభాస్కర్, ఎం.సురేష్ ఉన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ

జగ్గంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల విషయంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సూచించారు. జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, మానవ అక్రమ రవాణా, సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దాపురం డీఎస్పీ మాట్లాడుతూ ఈమెయిల్స్, వాట్సాప్, టెలిగ్రాంలో వచ్చే లింక్‌లను ఓపెన్ చేయకూడదన్నారు. సైబర్ నేరం బారినపడినట్టు తేలితే 24 గంటల్లోపు 1930కి ఫోన్ చేయాలన్నారు. అపరిచిత వ్యక్తుల పట్ల అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలన్నారు. యువత గంజాయికి బానిసలు కావద్దన్నారు. గంజాయి కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తు నాశనం అవుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవరపల్లి చెన్నారావు, జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ పీవీవీ సత్యనారాయణ, పి.విశ్వేశ్వరరావు తదితరులున్నారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వండి

మంత్రి లోకేశ్‌కు వల్లభనేని చందు వినతి



ఎటపాక, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు విలీన మండలాలను కలిపి ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, జిల్లా అమలుకు చర్యలు తీసుకోవాలని విద్యా శాఖమంత్రి నారా లోకేశ్‌ను తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు కోరారు. బుధవారం అసెంబ్లీ చాంబర్ ఆవరణలో మంత్రిని కలిసి విలీన మండలాల సమస్యలపై విన్నవించారు. విలీన మండలాల్లోని అర్హులైన పోలవరం నిర్వాసితులందరినీ గుర్తించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పరిహారంతో పాటు భూములకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఏజెన్సీలో విద్యా రంగ సమస్యలపై దృష్టిసారించి మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని కోరారు. గోదావరి వరదలతో విలీన మండలాల్లో రహదారులు దెబ్బతిన్నాయని, రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి లోకేశ్ సమస్యలపై సత్వరమే చర్యలు తీసుకోవాలని ఓఎస్డీ ఆకుల వెంకటరమణకు ఆదేశించినట్లు చందు చెప్పారు.

పలు సమస్యలపై వినతి

మోతుగూడెం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావుకు సీలేరు కాంప్లెక్స్ విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులు బుధవారం పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. 20ఏళ్లనుంచి విద్యుత్ సంస్థలో పని చేస్తోన్న వారిని డైరెక్ట్ పేమెంట్ చేయాలని, అర్హత బట్టి పర్మినెంట్ చేయాలని కోరారు. సీఐటీయూ రీజనల్ సెక్రటరీ రత్నాకర్, బీవీ రమణ, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

మారేడుమిల్లి, నవంబరు20(ఆంధ్రజ్యోతి): వేటుకూరులో గిరిజనుడి ఇల్లు అగ్నిప్రమాదంలో కాలిపోయింది. ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ ప్రకటించిన రూ.20వేలును టీడీపీ మండలాధ్యక్షుడు గురుకు శేషుకుమార్, జనసేన మండలాధ్యక్షుడు మల్లా దుర్గాప్రసాద్ బుధవారం బాధితుడు డొక్కులూరి హేమంత్‌కుమార్‌కు అందజేశారు. టీడీపీ నాయకులు బీశెట్టి అప్పాజీ, షేక్ సుభాన్, పొడియం శ్రీనుబాబు, కర్రి సన్యాసిరెడ్డి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు సర్వీసు పునః ప్రారంభం

చింతూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖ నేతృత్వంలో చింతూరు-అల్లిగూడెం మధ్య ఉచిత బస్సు సర్వీసు పునః ప్రారంభమైంది. ఉచిత బస్సు సర్వీసుని బుధ వారం చింతూరు ఎస్ఐ రమేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మూరుమూల ప్రాంతాలకు సురక్షితమైన ప్రయాణ సౌకర్యం కల్పించాలన్న ఉద్దేశంతో గతంలో చింతూరు-అల్లిగూడెం మధ్య ఉచిత బస్సు సర్వీసుని పోలీసు ఉన్నతాధికారులు ప్రారంభించారని, వరద నేపథ్యంలో ఆ సర్వీసు నిలిచిపోయిందన్నారు. ఎస్పీ అమిత్‌బర్దర్ చొరవతో బస్సు సర్వీసును పునఃప్రారంభించామన్నారు. బస్సు సర్వీసు ఖర్చును పోలీసు శాఖ భరిస్తుందన్నారు. ఆదివాసీలకు ఆత్మీయ బహుమానంగా పోలీసుశాఖ ఈసౌకర్యాన్ని కల్పించిందని ఎస్ఐ పేర్కొన్నారు.

దార్లవలసకు రోడ్డు సదుపాయం కల్పించండి

రంపచోడవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వేములకొండ పంచాయతీ దార్లవలస గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించాలని గ్రామస్తులు బుధవారం ఐటీడీఏ ఏపీవో డీఎన్‌వీ రమణను కలిసి వినతిపత్రం అందజేశారు. 30ఏళ్లగా అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా గ్రామ అభివృద్ధిపై దృష్టిసారించలేదన్నారు. బీటీ రోడ్డు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కోరారు. గ్రామస్తులు శ్యామల బజ్జిదొర, రం జాన్, బజారుదొర, వంజం సుధాకర్‌దొర, అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ నాయకురాలు బచ్చెల శ్రీదేవి పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

ఎటపాక, నవంబరు20(ఆంధ్రజ్యోతి):గొందిరాజుపేట (కారం వారిగుంపు)లో అగ్నిప్రమాద బాధిత కారం రవి కుటుంబానికి బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో నిత్యావసరాలు, బియ్యం, బిందె అందజేశారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి పక్కా ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ కోరారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు వల్లభనేని సత్యనారాయణ, ఎంపీటీసీ కంటే రాజు, కారం పెంటయ్య, గడ్డం వెంకటేష్ పాల్గొన్నారు.

1న మాలల సింహ గర్జన

ఎటపాక,నవంబరు20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో డిసెంబరు 1నజరగనున్న మాలల సింహ గర్జన ఆత్మ గౌరవ సభను జయప్రదం చేయాలని మాల మహానాడు చింతూరు డివిజన్ అధ్యక్షుడు డేగల వంశీ కోరారు. కన్నాయిగూడెంలో ఆ సంఘం ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈగర్జనకు విలీన మండలాల్లోని మాలలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. సత్తిబాబు, రామారావు, నరసింహారావు పాల్గొన్నారు.

వైద్య సేవలు

మోతుగూడెం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గూడూరు సచివాలయం పరిధిలోని నేలకోట గ్రామంలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని ఐటీడీఏ పీవో అపూర్వభారత్ బుధవారం పరిశీలించారు.

రైల్వే వినియోగదారుల కమిటీ సభ్యుడిగా నాగేశ్వరరావు



ఎంపీ ఉదయ్ నుంచి నియామకపత్రం అందుకుంటున్న నాగేశ్వరరావు

శంఖవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డివిజనల్ రైల్వే వినియోగదారులు సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా కొంతంగి జనసేన నేత గొర్లి నాగేశ్వరరావు నియమితులైయ్యారు. ఆయన నియామకాన్ని రైల్వే అధికారులు ధ్రువీకరించనట్టు ఆయన తెలిపారు. నియామకపత్రాన్ని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ నాగేశ్వరరావుకు అందించారు. పార్టీకి చేసిన కృషికి ఫలితంగా తనకు ఈ పదవి వచ్చిందని, మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. నాగేశ్వరరావు నియామకం పట్ల నియోజకవర్గ ఇంచార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, నేతలు మేకల కృష్ణ, నల్లల రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

'జనవాణి'లో తుమ్మలపల్లి



అర్జీలు స్వీకరిస్తున్న ఎంపీ, తుమ్మలపల్లి

జగ్గంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌తో కలిసి జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొని అర్జీలు స్వీకరించారు. మార్కెండేయ బాబు, శ్రీనివాస్ ఉన్నారు.

తప్పిపోయిన వృద్ధురాలిని బంధువులకు అప్పగింత



వృద్ధురాలిని అప్పగిస్తున్న రైల్వే హెచ్‌సీ శ్యామ్

అన్నవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అన్నవరం రైల్వేస్టేషన్‌లో బ్యాగ్‌తో అనుమానాస్పదంగా తిరుగుతున్న వృద్ధురాలిని తుని జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ శ్యామ్ ఆమె కుటుంబసభ్యులకు అప్పగించారు. కర్నూలు జిల్లా మంత్రాలయం సమీప గ్రామమైన రాయచూర్‌కు చెందిన గుర్రం లక్ష్మీదేవి బంధువులతో తీర్థయాత్రలకు విచ్చేయగా అన్నవరం రైల్వేస్టేషన్‌లో దిగి ఎటువెళ్లాలో తెలియక అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో తుని రైల్వే ఎస్ఐకు తెలపగా ఆయన పలుస్టేషన్లలో విచారించి బంధువులను రప్పించి అప్పగించారు. హెచ్‌సీ శ్యామ్‌ను అభినందించారు.

డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డవారికి జైలు

ప్రత్తిపాడు, నవంబరు20(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో బుధవారం పట్టుబడ్డవారిలో ఇద్దరికి వారం రోజులు జైలు శిక్ష, మరో 9 మందికి ఒకొక్కరికి రూ.10వేలు వంతున జరిమానా విధిస్తూ జడ్జి కాటంభాను తీర్పు చెప్పినట్లు సీఐ అప్పారావు తెలిపారు.

సారాతో వ్యక్తి అరెస్టు

జగ్గంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గొల్లలగుంటలో సారా తయారు చేస్తున్న తలారి రాజును పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. 10 లీటర్ల నాటు సారాం సీజ్ చేశారు. అతడిని పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా డిసెంబరు 1తేదీ వరకు రిమాండ్ విధించారు.

పత్రిక ప్రకటన

ఎక్సైజ్ విభాగంలోని ఐయంయల్ డిపోలో ఫర్నిచర్‌ను ఈ నెల 25న ఉదయం 10 గంటలకు వేలం వేస్తామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీమతి కృష్ణకుమారి గారు మరియు డిపో మేనేజర్ సిహెచ్.రమణబాబు గారు (ఇంఛార్జి) తెలిపారు. గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉపయోగించిన ఫ్రీజర్లు-133, ఇన్వర్టర్ మరియు బ్యాటరీ-149, క్యాస్ చెస్ట్-166, స్కానర్లు-332, క్యాష్‌కౌంటింగ్ మిషన్లు-166, వీటికి సంబంధించి వేలం ప్రక్రియలో పాల్గొనదలచినవారు ఏపీఎస్బీసీఎల్ డిపోను సంప్రదించాలని కోరారు. పూర్తి సమాచారం కోసం 9949351051, 8886262201 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వేలం వేయు ప్రదేశము: కటకం బాబు గారి గొడౌన్, విమల్ డ్రింకింగ్ ఫ్యాక్టరీ ప్రక్కన, సామర్లకోట

డిపో మేనేజర్ I/C
ఐఎంఎల్ డిపో, సామర్లకోట